


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 266 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 31 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :266 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 31 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- నాయుడుపేటలోని జిందాల్ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్ తయారీ
- ఉత్పత్తి, వ్యయం తదితర వివరాలను తెలుసుకున్న పవన్ కల్యాణ్
- కాకినాడ జిందాల్ ప్లాంట్ పై ఆరా తీసిన డిప్యూటీ సీఎం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెల్లూరు జిల్లా నాయుడుపేటలోని జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే) ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లాంట్ నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు. ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడిన

- మిగతా 2లో



# గొడ్డలి పార్టీ.. అరాచకత్వం

## వైఎస్ జగన్‌ది హత్యా రాజకీయమే

- ఇప్పుడిప్పుడే ఆయన అరాచకాలు వెలుగులోకి..
- కడప జిల్లాలో పాలెగాళ్ల రాజ్యం పుస్తకం చదివితే నిజాలు తెలుస్తాయి.
- తుపాకీ పట్టడంతో మావోయిస్టులు విజయం సాధించలేకపోయారు
- హింసతో ఎవరు ఏమీ సాధించలేరు
- అమరావతి మీడియా సమావేశంలో చంద్రబాబు

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్: గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్ట్రేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారు. మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు. వీళ్లు మాత్రం గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారు? వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉంది. ఆమె పోరాటం వల్లే ఇప్పటికీ ఆ హత్య కేసు సజీవంగా ఉంది. నేటి తరానికి కూడా వీళ్ల హత్యా రాజకీయాలు తెలుస్తున్నాయి"



### ఖరీఫ్ సాగునీటి సరఫరాపై

## కీలక నిర్ణయాలు మంత్రి కందుల దుర్గేష్!

- మే 31 నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలని నిర్ణయం
- సాగునీటికి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటామన్న దుర్గేష్
- నాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధం కావాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సాగునీ టి సరఫరాను క్రమబద్ధీకరిం చేందుకు నీటిపా రుదల సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

- మిగతా 2లో



## ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు

- ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించబోతున్నారంటూ ప్రచారం
- నిరసనలకు దిగిన ఎంప్లాయీస్ యూనియన్
- ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్న రాంప్రసాద్ రెడ్డి

- మిగతా 2లో

# ప్రణయ్ ప్రకాశ్ విలాసాలు, నగదు కట్టల గుట్టు విప్పిన సిట్ ఛార్జిషీట్!

### ప్రణయ్ ప్రకాశ్ ఆర్థిక లావాదేవీలను ఏసీబీ కోర్టుకు సమర్పించిన సిట్

### డిస్టిలరీల నుంచి వందల కోట్ల వసూళ్లు

### దేశ విదేశాల్లోని అత్యంత ఖరీదైన హోటళ్లలో బస

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ దర్యాప్తులో అత్యంత కీలకమైన మైలురాయి నమోదైంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం... ఏసీబీ కోర్టులో మరో అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ తాజా ఛార్జిషీట్‌లో నిందితుడు ప్రణయ్ ప్రకాశ్ ఆర్థిక లావాదేవీలను సిట్ ఆధారాలతో కోర్టు ముందు ఉంచింది. సిట్ సమర్పించిన నివేదిక ప్రకారం.. వివిధ డిస్టిలరీల నుంచి వందల కోట్ల రూపాయల మేర వసూళ్లకు పాల్పడిన వ్యవహారంలో ప్రణయ్ ప్రకాశ్ అత్యంత కీలక సూత్రధారిగా వ్యవహరించారు. ఈ వసూళ్ల పర్వంలో ఆయన ఒంటరిగా

- మిగతా 2లో




### జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్

# ప్రమాణ స్వీకారం...

## అది చాలా మంచి రోజన్న వాస్తు నిపుణుడు

- సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నిక
- ప్రమాణ స్వీకారం ఖరారు చేసిన వాస్తు నిపుణుడు గురూజీ ఆరాధ్య
- జూన్ 3 సాయంత్రం 5:15 గంటలకు వృశ్చిక లగ్నంలో కార్యక్రమం

పెన్ పవర్ డెస్క్:డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. జూన్ 3వ తేదీ సాయంత్రం 5:15 గంటలకు ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. వాస్తు నిపుణులు గురూజీ ఆరాధ్య స్వయంగా ఈ ముహూర్తాన్ని నిర్ణయించినట్లు శనివారం ప్రకటించారు. శివకుమార్ నివాసం వద్ద మీడియాతో

- మిగతా 2లో





### ఆధునిక యుద్ధాల్లో ఏఐ కీలకం..

## భవిష్యత్ యుద్ధాలకు అదే ఆయుధం

పెన్ పవర్ డెస్క్:ఆధునిక యుద్ధ క్షేత్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యత రోజురోజుకు పెరుగుతోందని, వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందని

- మిగతా 2లో

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

- కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావన్న ఆదిత్యనాథ్
- దేశాన్ని, ధర్మాన్ని కాపాడేందుకు ధర్మ హింస కూడా అవసరమేనని వ్యాఖ్య
- సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచన

- మిగతా 2లో



# ఇండియా ఒక 'పవర్ ఫుల్' కంట్రీ




## అమెరికా రక్షణ మంత్రి హెగ్సెత్ ప్రశంసలు

- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ఒక కీలక శక్తి అని కొనియాడిన అమెరికా
- సింగపూర్‌లోని షాంగ్రి-లా సదస్సులో యూఎస్ రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వ్యాఖ్యలు
- భారత్ తన సైన్యాన్ని వేగంగా ఆధునికీకరిస్తోందని ప్రశంస
- మిత్రదేశాలు రక్షణ వ్యయాన్ని పెంచాలని అమెరికా పిలుపు

పెన్ పవర్ డెస్క్:ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ ఒక 'శక్తివంతమైన దేశం' అని, ప్రాంతీయ బలాల సమతుల్యతకు కీలకమైన శక్తిగా నిలుస్తోందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్

- మిగతా 2లో

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

- సీయూఈటీ యూజీ 2026 పరీక్షల్లో సాంకేతిక లోపం
- పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం
- సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన
- విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం

- మిగతా 2లో



## రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!

- రాజస్థాన్‌లోని పలు జిల్లాలను ముంచెత్తిన ఇసుక తుఫాను
- చురు, బికనీర్, శ్రీ గంగానగర్‌పై తీవ్ర ప్రభావం
- అరగంట పాటు దట్టమైన ధూళితో అంధకారంగా మారిన వాతావరణం
- పశ్చిమ అలజడుల కారణంగానే ఈ తుఫానులు అని వెల్లడి
- ప్రస్తుతానికి ప్రాణనష్టంపై ఎలాంటి సమాచారం లేదు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### నాగబాబు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నారా? నిజమెంత?

జనసేన ఎమ్మెల్సీ నాగబాబుకు రాజ్యసభ పదవి దక్కే అవకాశాలున్నాయి. జనసేనకు కేటాయించే ఒక్క దానిని నాగబాబుకు ఇవ్వాలని పవన్ డిసైడ్ అయినట్లుంది. ఈ మేరకు పార్టీలో ప్రచారం జరుగుతుంది. నాగబాబు ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని భావించారు. కానీ అనేక సమీకరణాలతో ఆ ప్రతిపాదనను పవన్ కల్యాణ్ పక్కన పెట్టేశారు. నాగబాబుకు ఇక మంత్రి వచ్చే అవకాశం లేదు. అందుకే ఆయనను పెద్దల సభకు పంపితే ఢిల్లీ స్థాయిలో పార్టీకి, తనకు అండగా ఉంటారని పవన్ కల్యాణ్ భావిస్తున్నారని అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఇందుకు నాగబాబు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**అనేక కారణాలతో...**

నాగబాబుకు మంత్రి పదవి వస్తుందని ఇటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, అటు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా మీడియా ఎదుట బహిరంగంగానే చెప్పారు. కానీ సామాజికవర్గాల సమీకరణ నాగబాబు మంత్రి పదవికి అడ్డంకిగా మారింది. ఇప్పటికే జనసేనకు చెందిన ఇద్దరు కేబినెట్ లో ఉన్నారు. పవన్ కల్యాణ్, కందుల దుర్గేష్ ఉండటంతో నాగబాబుకు కూడా మంత్రి పదవి ఇస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని పవన్ కల్యాణ్ ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లు చెబుతున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పటికే తనను ఒక కులానికి పరిమితం చేయవద్దని పదే పదే చెబుతుండటం కూడా ఈ ప్రచారానికి కొంత ఊతమిస్తుంది.

**ఎప్పుడో దక్కాల్సి ఉన్నా...**

నాగబాబుకు ఎప్పుడో మంత్రి పదవి దక్కాల్సింది. అయితే పవన్ కల్యాణ్ అన్ని రకాలుగా ఆలోచించి నాగబాబును కేబినెట్ లోకి తీసుకోకూడదని నిర్ణయించారని సమాచారం. నాగబాబును కాకుండా మరో బీసీ వర్గానికి మంత్రి పదవి ఇస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి కొంత రాజకీయంగా ఉపయోగంగా ఉంటుందన్న అంచనాతో నాగబాబును ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి రాజ్యసభకు పంపాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. తన సోదరుడికి ఆ పదవి ఇస్తే కొంత గౌరవం కూడా ఇచ్చినట్లవుతుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారని చెబుతున్నారు. అయితే దీనిపై ఇంకా అధికార ప్రకటన రాకపోయినప్పటికీ జనసేన పార్టీ రాజ్యసభ పదవి లింగమనేని రమేష్ కు కాకుండా నాగబాబుకు ఇవ్వాలని డిసైడ్ అయినట్లు జరుగుతున్న ప్రచారంలో నిజమెంత అనేది త్వరలోనే తెలియనుంది.

## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షలో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.

### ఆధునిక యుద్ధాల్లో ఏఐ కీలకం.. భవిష్యత్ యుద్ధాలకు అదే ఆయుధం

- మొదటి పేజి తరువాయి

భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. మారుతున్న యుద్ధ తంత్రంలో వస్తున్న సంక్లిష్టతలను అధిగమించేందుకు కొత్త టెక్నాలజీలు తప్పనిసరిగా అవసరం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. శనివారం నాడు పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో 150వ కోర్సు పాసింగ్ అవుట్ పరేడ్‌ను సమీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత యుద్ధ క్షేత్రాలు భారీ స్థాయిలో సమాచారాన్ని సృష్టిస్తున్నాయని, అనేక రకాల వనరులు ఇందులో భాగమవుతున్నాయని జనరల్ ద్వివేది వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో కమాండర్లు, సైనికులు వేగంగా సమాచారాన్ని విశ్లేషించి, తక్షణమే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. "యుద్ధ వేగం ఎక్కువగా ఉన్నప్పుడు, వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అదనపు సాంకేతిక మద్దతు అవసరం. ఇక్కడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవసరం ఏర్పడుతుంది. భారీ వనరులను ఒకేసారి నియంత్రించడం కష్టమైనప్పుడు ఏఐ సాయపడుతుంది" అని ఆయన తెలిపారు. నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో 'అబ్జర్వ్, ఓరియెంట్, డిసైడ్, యాక్ట్' (ఓఓడీఏ) అనే సైకిల్ ఉంటుందని, సంక్లిష్ట పరిస్థితుల్లో దీనిని వేగవంతం చేసేందుకు ఏఐ టెక్నాలజీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. ముఖ్యంగా స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వంటివి సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేయడానికి, వనరులను సమర్థవంతంగా కేటాయించడానికి దోహదపడతాయని అన్నారు. ఇదే సమయంలో సైనిక కార్యకలాపాల్లో డ్రోన్ల పాత్ర కూడా గణనీయంగా పెరిగిందని జనరల్ ద్వివేది హైలైట్ చేశారు. "ప్రస్తుత వాతావరణంలో, శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు అధికంగా ఉంది. వాటిని ఎదుర్కోవడానికి మనకు కౌంటర్-డ్రోన్ వ్యవస్థలు అవసరం. అదే సమయంలో, మన డ్రోన్లను కూడా సమర్థంగా ఉపయోగించుకోవాలి. యుద్ధ క్షేత్రంలో వనరులు భారీగా పెరిగిపోయాయి" అని ఆయన పేర్కొన్నారు. డ్రోన్లు, సెన్సార్లు, నిఘా పరికరాలు వంటి వాటిని సమర్థంగా నిర్వహించడానికి ఆటోమేషన్ తప్పనిసరి అని, ఇందుకు ఏఐ కీలకమైన సాధనంగా నిలుస్తుందని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు.

# గొడ్డలి పార్టీ.. అరాచకత్వం

- మొదటి పేజి తరువాయి

"నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులపై కేంద్రం పట్టుదలగా ఉంది. ఇవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి. రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. బిల్లులను గతంలో వ్యతిరేకించిన వారి ఆలోచనలు ఇప్పుడు మారొచ్చు. తెదేపా ప్రకటించిన 33 శాతం రిజర్వేషన్లు దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. మహిళలకు మొదటినుంచి మా పార్టీ అండగా ఉంది. పునర్విభజనలో 2011 జనాభా లెక్కలైనా, తాజా జనాభా లెక్కలైనా మనకు నష్టం. ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే ఎవరికీ నష్టం ఉండదు" అని ముఖ్యమంత్రి తెలిపారు.

**బక్కని నర్సింహులు వ్యాఖ్యలు సరికాదు: చంద్రబాబు**

తెదేపా జనరల్ సెక్రటరీలు, జోనల్ ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమావేశమయ్యారు. హైబ్రిడ్ మహానాడు విజయవంతమైందన్నారు. మహానాడు సందర్భంగా తెలంగాణ తెదేపా నేత బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి తప్పుపట్టారు. తెలంగాణపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఏ ఒక్కరీ మనోభావాలు దెబ్బతీయకూడదని సూచించారు. తెలుగు జాతి ఒక్కటేనని చెప్పారు. తెదేపా పుట్టిందే తెలంగాణ గడ్డపై అని గుర్తుచేశారు. ఆ రాష్ట్రంలో ఇప్పటికీ బలమైన క్యాడర్ ఉందన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నేతలతో చంద్రబాబు భేటీ అయ్యారు. రాజ్యసభ స్థానాలకు అవకాశం కల్పించాలని పలువురు ఆశావహులు ఆయన్ను కోరారు. వర్ల రామయ్య, కంభంపాటి రామ్మోహన్‌రావు, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# ఇండియా ఒక 'పవర్ ఫుల్' కంట్రీ

- మొదటి పేజి తరువాయి

ప్రశంసించారు. సింగపూర్‌లో శనివారం జరిగిన 'షాంగ్రి-లా డైలాగ్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసియాలోనే అతిపెద్ద రక్షణ, భద్రతా వేదిక అయిన ఈ సదస్సులో హెగ్సెత్ మాట్లాడుతూ, భారత్ తన సైన్యాన్ని వేగంగా ఆధునికీకరించుకుంటోందని అన్నారు. "ఉన్నత స్థాయి సైనిక కార్యకలాపాలను నిర్వహించేందుకు భారత్ భారీ పారిశ్రామిక, లాజిస్టిక్స్ సామర్థ్యాలను నిర్మించుకుంటోంది. దక్షిణాసియాలో, ప్రాంతీయ సమతుల్యతను కాపాడటంలో భారత్ ఒక కీలక శక్తి. శక్తివంతమైన భారత్ తన సొంత ప్రయోజనాల కోసం పనిచేయడంతో పాటు, ఈ ప్రాంతంలో బలాల సమతుల్యతను కాపాడాలనే మా ఉమ్మడి లక్ష్యాన్ని ముందుకు తీసుకెళుతోంది" అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా-భారత్ మధ్య పెరుగుతున్న రక్షణ సహకారాన్ని, ముఖ్యంగా సైనిక సామర్థ్యాలను పెంచేందుకు ఉద్దేశించిన సంయుక్త కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ఈ ప్రాంతంలో చైనా సైనిక విస్తరణపై ఆందోళన వ్యక్తం చేసిన హెగ్సెత్, మిత్రదేశాలు భద్రతా బాధ్యతల్లో మరింత పాలుపంచుకోవాలని, రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కొన్ని దేశాలు తమ జీడీపీలో 3.5 శాతం రక్షణకు కేటాయించాలని ఆయన సూచించారు.

ఇరాన్ వంటి ఇతర అంతర్జాతీయ అంశాలపై దృష్టి సారించినప్పటికీ, ఇండో-పసిఫిక్ ప్రాంతంపై అమెరికాకు ఉన్న ప్రాధాన్యం తగ్గలేదని ఆయన స్పష్టం చేశారు. 2025లో భారత్-అమెరికా దేశాల మధ్య కుదిరిన పదేళ్ల రక్షణ ఒప్పందం పునాదిగా ఈ సహకారం మరింత బలపడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రణయ్ ప్రకాశ్ విలాసాలు, నగదు కట్టల గుట్టు విప్పిన సిట్ ఛార్జిషీట్!

- మొదటి పేజి తరువాయి

కాకుండా, లూప్‌లో ఉన్న పలువురు ప్రభావవంతమైన వ్యక్తులతో కలిసి ఒక సిండికేట్‌గా పనిచేసినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. ప్రణయ్ ప్రకాశ్ మద్యం అక్రమ సంపాదనతో ఎలాంటి విలాసవంతమైన జీవితాన్ని గడిపారనేది సిట్ ఛార్జిషీట్‌లో వివరంగా పేర్కొంది. వైసీపీ నేత చెవిరెడ్డితో కలిసి పలుమార్లు విదేశీ పర్యటనలు చేసినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డితో కలిసి చార్టర్డ్ విమానాల్లో ప్రయాణిస్తూ, దేశ విదేశాల్లోని అత్యంత ఖరీదైన హోటళ్లలో బస చేస్తూ కోట్లాది రూపాయలు విలాసాలకు తగలేసినట్లు సిట్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఈ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన మరో దిగ్భ్రాంతికరమైన అంశం ఏమిటంటే... మద్యం అక్రమ లావాదేవీల ద్వారా వసూలైన లెక్కల్లో లేని భారీ నగదును దాచడానికి నిందితులు ఒక ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) పలు నగరాల్లోని విలాసవంతమైన అపార్ట్‌మెంట్లను కేవలం నగదు దాచడానికే అద్దెకు తీసుకున్నారు. ఆ ఫ్లాట్లలోని రహస్య ప్రదేశాల్లో పెద్ద ఎత్తున నగదు కట్టలను భద్రపరిచినట్లు సిట్ ఆరోపించింది.

ఈ గుట్టు మొత్తాన్ని సిట్ అధికారులు పక్కా టెక్నికల్ ఆధారాలతో బట్టబయలు చేశారు. నిందితుల మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌ల నుంచి సేకరించిన డేటాను డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ చేయడం ద్వారా ఈ వాస్తవాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు, లొకేషన్ డేటా, వాట్సాప్ చాట్‌లను సమగ్రంగా క్రోడీకరించి ఏసీబీ కోర్టుకు సమర్పించారు. సిట్ దాఖలు చేసిన ఈ తాజా ఛార్జిషీట్ ఆధారంగా రాబోయే రోజుల్లో మరికొందరు కీలక నేతలకు, అధికారులకు నోటీసులు వచ్చే అవకాశం ఉందనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో గట్టిగా వినిపిస్తోంది.

## ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు

ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్‌ఆర్టీసీ ప్రైవేటీకరణ కాబోతోందంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రైవేటీకరణ వార్తల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంప్లాయిస్ యూనియన్ నిరసనలు చేపట్టింది. ఈ నిరసనల్లో వైసీపీ కూడా పాల్గొంది. మరోవైపు, ఈ ప్రచారంపై రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్థికంగా నిలకడగా ఉందని, సంస్థకు రూ. 30 వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా, ఆర్టీసీ ప్రయాణ ఛార్జీలను పెంచే ఉద్దేశం కూడా లేదని ప్రయాణికులకు తీపి కబురు చెప్పారు. సంస్థను మరింత ఆధునికీకరించేందుకు త్వరలోనే కొత్తగా 2,500 ఎలక్ట్రిక్, 500 సీఎన్జీ బస్సులను ప్రవేశపెట్టబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి

వచ్చిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, కార్మికుల సమస్యలన్నింటినీ రెండేళ్లుగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అవసరమైన ఉద్యోగాలను కూడా త్వరలోనే భర్తీ చేస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అహింస మానవాళికి పరమ ధర్మమే అయినప్పటికీ, దేశానికి లేదా సమాజానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. బలహీనులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించదని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాలతోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకుంటాయని యోగి పేర్కొన్నారు. శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ.. 2017కు ముందు యూపీలో మాఫియా ఆధిపత్యం, నేరాలు ఎక్కువగా ఉండేవని, బీజేపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగయ్యాయని గుర్తుచేశారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తూ భారతదేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.

## జిందాల్ 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్‌ను సందర్శించిన పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

పవన్ కల్యాణ్.. చెత్త నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి అవుతున్న వ్యయం, ప్లాంట్ రోజువారీ నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న విద్యుత్ ఎంత? అలాగే యూనిట్ విక్రయ ఛార్జీల వివరాలు ఏంటి? అనే అంశాలను ప్లాంట్ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రికి వివరంగా వివరించారు.

ఈ పర్యటనలో కాకినాడలో నిర్మిస్తున్న జిందాల్ ప్లాంట్ ఆలస్యంపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని ఆయన ప్రశ్నించగా... రాబోయే నవంబరు లోపు ఆ ప్లాంట్‌ను కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని జిందాల్ ప్రతినిధులు డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా.. ఇటువంటి విద్యుత్ ప్లాంట్ల వల్ల పరిసర ప్రాంతాల్లో కాలుష్యం ఏ మేరకు పెరుగుతోంది, దాన్ని అదుపు

చేయడానికి తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటనే దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీనిపై జిందాల్ ప్రతినిధులు స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణ మండలి ఏడాదికి నాలుగుసార్లు ప్లాంట్‌ను పరిశీలించి నివేదిక ఇస్తోందని ఉపముఖ్యమంత్రికి వివరించారు.

## జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం...

- మొదటి పేజి తరువాయి

మాట్లాడిన గురూజీ ఆరాధ్య, జూన్ 3 బుధవారం రోజు వృశ్చిక లగ్నంలో ప్రమాణ స్వీకారానికి శుభప్రదంగా ఉంటుందని తెలిపారు. వాస్తవానికి జూన్ 5వ తేదీని పరిశీలించినా, ఆ రోజు ఓ ముఖ్యమైన వ్యక్తి అందుబాటులో ఉండరన్న కారణంతో జూన్ 3ని ఖరారు చేసినట్లు ఆయన వివరించారు. శివకుమార్ జాతకానికి సంబంధించిన జ్యోతిష్యపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ బెంగళూరులోని అజ్జయ్య మఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను కలిసిన అనంతరం ఆయన స్వామీజీతో భేటీ అయినట్లు సమాచారం. మరోవైపు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా డీకే శివకుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిద్ధరామయ్య సీఎల్పీ నేతగా (తదుపరి సీఎంగా) డీకేఎస్ పేరును ప్రతిపాదించగా, కాంగ్రెస్ సభ్యులు బలపరిచారు.

## ఖరీఫ్ సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు

- మొదటి పేజి తరువాయి

తీసుకున్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ. 148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు.

## రాజస్థాన్‌లో భారీ ఇసుక తుపాను... పట్టపగలే చీకట్లు!

రాజస్థాన్‌లోని పలు జిల్లాలను శనివారం శక్తిమంతమైన ఇసుక తుపాను ముంచెత్తింది. దట్టమైన ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్మేయడంతో వాతావరణం ఒక్కసారిగా అంధకారంగా మారింది. ఇసుక తుపాను అనంతరం భారీ వర్షం కురిసింది. ఈ తుపాను ప్రభావం చురు జిల్లాపై అధికంగా కనిపించగా, బికనీర్, శ్రీ గంగానగర్ జిల్లాల్లోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. సుమారు 30 నిమిషాల పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన ఈ తుపాను బీభత్సం సృష్టించింది. ఈ గాలులకు ఇసుక భారీగా కొట్టుకొచ్చి రోడ్లు, నివాస ప్రాంతాలను కప్పేసింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల రహదారులపై కొన్ని అడుగుల మేర ఇసుక పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను సమయంలో దారి కనిపించక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమ అలజడుల ప్రభావం వల్లే ఈ ప్రాంతంలో తరచూ ఉరుములు, వర్షాలతో కూడిన ఇసుక తుపానులు ఏర్పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ తుపానుల వల్ల తీవ్రమైన ఎండల నుంచి కొంత ఉపశమనం లభించినప్పటికీ, రవాణా, విద్యుత్ సరఫరా వ్యవస్థలకు అంతరాయం కలుగుతోంది. శ్రీ గంగానగర్ వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటడం అక్కడి తీవ్ర పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం గానీ జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లోనూ బికనీర్, షెఖావతి ప్రాంతాల్లో ఇలాంటి వాతావరణ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# మాలల ఐక్యత చైతన్యయాత్రను విజయవంతం చేయండి.

## జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు.

కావలి పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్ ) మే:30 కావలి బుద్ధ విహార్ లో మాలల సంక్షేమ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం మాల మహాసభ, మాల మహానాడు. మాల విద్యార్థి సంఘం. హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకు మాలల ఐక్యత చైతన్య యాత్రనిర్వహిస్తున్నాం. ఈకార్యక్రమానికి నిర్వహణ కమిటీనాయకులు డాక్టర్ కోట్ల గంగాధర్, మల్లెల వెంకట్రావు మాలల సమావేశం లో అతిధులుగాపాల్గొన్నారు. ఈ సమావేశంలో మాలమహాసభవ్యవస్థాపకులు మల్లెల వెంకట్రావుమాట్లాడుతూ కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చాక మాలలను విద్య ఉద్యోగ రాజకీయ సంక్షేమ రంగాలలో అణిచివేసేందుకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని తీసుకు వచ్చింది. జనాభా ప్రాతిపదిక మీద వర్గీకరణ చేస్తున్నామని చెప్పి 12 శాతం ఉన్న మాలలకు 7:1/2 రిజర్వేషన్ మాత్రమే కేటాయించి నాలుగు శాతం ఉన్న మాదిగలకు ఆరున్నర శాతం రిజర్వేషన్లు ఇవ్వడం మాలల పట్ల ఉన్న వివక్షకు నిదర్శనం. మాల ఉద్యోగులకు ప్రాధాన్యత లేని పోస్టులను కేటాయిస్తూ ప్రమోషన్లలో మాదిగలకు ప్రాధాన్యమైన సీట్లను ఇవ్వడం మాల ఉద్యోగులపై రాజకీయ వేధింపులు ఏసీబీ దాడులు చేస్తూ వారిని భయభ్రాంతులను చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఎన్నికల్లో నెగ్గిన మాల శాసనసభ్యులు పార్లమెంటు సభ్యులపై అగ్రకులశాసనసభ్యులు పార్టీ నాయకులు స్వారీ చేస్తూ నియోజకవర్గాలలో ఖర్చు చేయాల్సిన నిధులను దారి మళ్లిస్తున్నారు మాల శాసనసభ్యులున్న చోట్ల పార్టీ అగ్రకుల నాయకులను ఇన్చార్జిలుగా వేసి రాజ్యాంగ హక్కుల అతిక్రమిస్తున్నారు. గ్రామాలలో మాలలపై అగ్రకుల వేధింపులు పెరిగిపోయాయి అధికార మదంతో నిరంతరం మాలలపై దాడులు చేస్తూ ఎన్నో సంవత్సరాలుగా మాలలు సాగు చేసుకుంటున్నా అసైన్మెంట్ భూములు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుంటూ దౌర్జన్యకాండ కొనసాగిస్తున్నారు కాపాడాల్సిన పోలీస్ యంత్రాంగం నిందితులతో కొమ్మకై బాధితులపైనే కేసులు . పెడుతున్నారు. రెవెన్యూ అధికారులు మాలల భూములను రికార్డులలో తారుమారు చేస్తున్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ చట్టంలో రోస్టర్ పాయింట్లు మాదిగలకు అనుకూలంగా మార్చి మాల విద్యార్థుల నిరుద్యోగుల అవకాశాలను మాదిగ విద్యార్థులకు కట్టబెడుతున్నారు ఇంజనీరింగ్ మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సూపర్ స్పెషాలిటీ కోర్సులలో మాల విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవ మత సంస్థలు చర్చిలు పై దాడులు చేస్తూ భయభ్రాంతులను చేస్తున్నారు చర్చిలకు వెళ్లే వాళ్లకు షెడ్యూల్డ్ కులం గుర్తింపును రద్దు చేస్తామని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు ఈ పరిస్థితులలో 80 లక్షల మంది మాలలను రాజకీయాలకు అతీతంగా ఒక వేదిక మీదకు తీసుకువచ్చి మాలలకురాజ్యాంగబద్ధంగా వచ్చే హక్కులను రక్షణలను భద్రతలనుకాపాడుకునేందుకు ఆగస్టు నెలలో విజయవాడలో జరుగు మాలల సింహగర్జనకు తరలి రావాల్సిందిగా మల్లెల వెంకట్రావు పిలుపునిచ్చారు. మాలల




సంక్షేమ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గంగాధర్ గారు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు మాల కార్పొరేషన్ కు నిధులు కేటాయించకుండా ఆ నిధులను పక్కదారి పట్టించి మాల నిరుద్యోగులను ఆర్థికంగా ఎదగకుండా మాదిగలకు మాత్రం డప్పు కళాకారులు చెప్పు కళాకారులు అని ఎస్సీ కార్పొరేషన్ నిధుల ద్వారా పెన్షన్లు అందిస్తున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ రానున్న ఎన్నికలలో మాదిగలకే సీట్లు ఇచ్చి మాలలను సర్వనాశనంచేయాలని కుట్ర పన్నుతున్నారు మాల పల్లెలోని ప్రాథమికపాఠశాలలను పథకం ప్రకారం రద్దు చేస్తున్నారు జనాభా లెక్కలలో మాలల జనాభాను తగ్గించి దళిత క్రైస్తవులుగా అందరిని బీసీలలో కలిపి ఈ రాష్ట్రంలో మాదిగ జనాభా మాలల కంటే ఎక్కువ అని చెప్పే కుట్ర చేస్తున్నారు కనుక మాల విద్యార్థులు ఉద్యోగులు రాజకీయ నాయకులు అంబేద్కర్ యువజన సంఘాలు మహిళలు చైతన్యంతో ఉండి జనాభా లెక్కలలో మరియు ఓటరు జాబితాల సవరణలోతప్పనిసరిగా పేర్లు నమోదు చేయించాల్సిందిగా పిలుపునిచ్చారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు దాసరి శివాజీ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాల మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ దండేల కృష్ణ మాల విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సుబ్బారాయుడు మాల మహాసభ నెల్లూరు కన్వీనర్ గణేష్,గంధం ప్రసన్నాంజనేయులు, దాసరి బాలకృష్ణ, దాసరి శివాజీ, కందుల శ్రీనివాసులు ప్రసాద్ పుల్లయ్య బోధి,మాల సంఘాల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# 40 డేస్ గో టూ విలేజ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయ్యండి నేతలు

పెన్ పవర్ ప్రతినిధి కొండాపురం 30 మే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కొండాపురం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ మండల స్థాయి అత్యవసర సమావేశం ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జీ గోసాల సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగినది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ,ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగలు మాట్లాడుతూ పల్లెకు పోదాం 40 డేస్ గో టు విలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం.... మాదిగ జాతి విద్య ప్రాముఖ్యతను గుర్తించేలా చేయడం కోసం..... ఎమ్మార్పీఎస్ అన్ని విభాగాల గ్రామ మండల స్థాయిలో నూతన నిర్మాణం చేయడం కోసం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరగని గ్రామాల్లో..100 కు 100% దండోరా జండా ఆవిష్కరణ జరిగేలా చూడడం కోసం.... కొండాపురం మండలంలోని అన్ని గ్రామాలలో యువకులతో పెద్దలతో మాట్లాడి పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరిగేలా చూడాలని ముఖ్యం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ కమిటీల నిర్మాణం జరగాలని వారు



తెలిపారు ఈ కార్యక్రమంలో 40 డేస్ గోటూ విలేజ్ మండల పర్యటన సభ్యులు కొడవటికంటి ఆంథోనీ మాదిగ,బంకా ఆదాము మాదిగ,బండారు చంద్ర మాదిగ,పసుపర్తి అశోక్ మాదిగ,కొప్పర్తి సుధాకర్ మాదిగ,పదర్ల చిన్న మాదిగ,గోసాల కల్యాణ్ మాదిగ,కొప్పర్తి నాగేశ్వరావు మాదిగ,గోసాల ఆశీర్వాదం మాదిగ,గోసాల నాగేశ్వరావు మాదిగ,రాజా మాదిగ తదితరులు పాల్గొన్నవారు

# కావలి ఏరియా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కే. సుబ్బారెడ్డి పదవీ విరమణ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి







కావలి పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్ ) మే :30 కావలి పట్టణంలోని ఎస్ఆర్ పార్క్లో కావలి ఏరియా ఆసుపత్రిలో 27 సంవత్సరాల పాటు సివిల్ సర్జన్ స్పెషలిస్ట్గా విశిష్ట సేవలు అందించిన డాక్టర్ కే. సుబ్బారెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోటి వైద్యులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ సుబ్బారెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి డాక్టర్ సుబ్బారెడ్డిని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ కే. సుబ్బారెడ్డి గత 27 సంవత్సరాలుగా వైద్య రంగంలో అంకితభావంతో పనిచేస్తూ వేలాది మంది రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించారని ప్రశంసించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవడం గొప్ప విషయమని అన్నారు. వైద్య వృత్తిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ సుబ్బారెడ్డి పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. సమాజానికి ఆయన చేసిన సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా తన అనుభవంతో ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, ప్రముఖులు మాట్లాడుతూ డాక్టర్ సుబ్బారెడ్డి సేవలను గుర్తుచేసుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పదవీ విరమణ వేడుకను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

## కావలిలో 48 మంది లబ్ధిదారులకు రూ.35.37 లక్షల చెక్కుల పంపిణీ

## మహానాడు తీర్మానాల అమలే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలి : ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..





కావలి పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్ ) మే:30 పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్సలు, ఇతర అవసరాల సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేతుల మీదుగా 35వ విడతలో 48 మంది లబ్ధిదారులకు రూ.35,37,408 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో ఇప్పటివరకు కావలి నియోజకవర్గంలో 1,188 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.9,66,47,935 మేర ముఖ్యమంత్రి సహాయనిధి అందజేయడం జరిగిందన్నారు. అవసరమైన సమయంలో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో సీఎంఆర్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఇటీవల మే 27, 28 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం ఘన విజయవంతమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి పలు కీలక తీర్మానాలు మహానాడులో ఆమోదించారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించబడిందన్నారు. అలాగే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ మహానాడును విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మహానాడు విజయవంతానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు,నిర్వాహకులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కావలి నియోజకవర్గంలోని 12 క్లస్టర్లు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో మహానాడును ఘనంగా నిర్వహించి పార్టీ పట్ల తమ నిబద్ధత, క్రమశిక్షణను చాటుకున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు. మహానాడులో ఆమోదించిన తీర్మానాలను ప్రతి కార్యకర్త అధ్యయనం చేసి వాటి అమలుకు కృషి చేయాలని సూచించారు. కావలి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు విషయంలో తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే పార్టీ లక్ష్యమని చెప్పారు. వచ్చే మహానాడు నాటికి ఈసారి తీసుకున్న తీర్మానాల అమలులో గణనీయమైన పురోగతి సాధించి పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, నారా లోకేష్కు మంచి పేరు తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయం ద్వారా సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సహాయం అవసరమైన ప్రతి అర్హుడికి సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి ప్రభుత్వానికి పంపించడం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధిదారులకు సహాయం అందుతోందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కోసం అడిగిన వెంటనే స్పందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కావలి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు,అల్లూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాస్ రెడ్డి,మాజీ సోమశిల చైర్మన్ కండ్లకుంట మధు బాబు నాయుడు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షురాలు కోసూరి ప్రత్యూష, తెలుగుదేశం పార్టీ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ ఇన్చార్జీలు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు..

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి -ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట,పెన్ పవర్, మే 30 ప్రభుత్వ ఆసుపత్రులకు వివిధ రోగాల నివారణ కోసం వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ వైద్య అధికారులకు సూచించారు. శనివారం ఎమ్మెల్యే సూళ్లూరుపేట మండలంలోని పేర్నాడు ప్రాథమిక వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రిలోని రోగులతో నేరుగా మాట్లాడిన వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు



సిబ్బంది సమయపాలన పాటించడంతోపాటు వైద్య వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అల్లూరు ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ యల్లంటి రాధిక మృతికి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నివాళి..

కావలి పెన్ పవర్( స్టాఫ్ రిపోర్టర్ ) మే:30 కావలి పట్టణం 12వ వార్డుకు చెందిన, అల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న యల్లంటి రాధిక అనారోగ్యంతో మృతి చెందడం పట్ల కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం రాధిక నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యల్లంటి రాధిక ప్రభుత్వ ఉద్యోగిగా తన విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలు అందించారని పేర్కొన్నారు. ఆమె మృతి కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా సహోద్యోగులకు, పరిచయస్తులకు తీరని లోటని అన్నారు. రాధిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎమ్మెల్యే, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక



ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, కాలనీ వాసులు పాల్గొని యల్లంటి రాధికకు నివాళులర్పించారు..

# జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చెందేటి సుజాత కు ఘన సన్మానం

నాయుడుపేట, పెన్ పవర్, మే 30 జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చెందేటి సుజాతను పెళ్ళకూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఘనంగా సన్మానించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా ఇటీవల చెందేటి సుజాత నియమితులైన విషయం తెలిసిందే. ఈ నేపద్యంలో శనివారం నాయుడుపేట పట్టణంలోని బేరిపేటలో గల జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నల్లకూరు మండల టిడిపి అధ్యక్షులు సంచి కృష్ణయ్య చెందేటి సుజాతకు శాలువా కప్పి, పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలుగా నియమితులైన చెందేటి సుజాత బీసీ



వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, ఆమె మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వారి వెంట జాతీయ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షురాలు కొన్నూరు సుజాత తదితరులు ఉన్నారు.

# కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి పనులను పరిశీలించిన..ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..





కావలి పెన్ పవర్( స్టాఫ్ రిపోర్టర్ ) మే :30 నెల్లూరు జిల్లా,బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఆలయ అధికారులు,కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి దేవస్థానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న తూర్పు గాలిగోపురం, పడమర గాలిగోపురం, భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న మెట్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణ వేగం, భక్తులకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి వసతులు, రహదారి సౌకర్యాలు, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే కాకుండా ఈ ప్రాంతానికి గుర్తింపుగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, అవసరమైన నిధుల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి చెందడం వల్ల జిల్లాలోని భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు కూడా మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్, శ్రీరామ్ మాలాద్రి కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# కావలి ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ పై అక్రమ కేసు ఎత్తివేయాలి



కావలి పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్ ) మే:30 కావలిలో పోలీసులు,విజిలెన్స్ అధికారులు టిడిపి నేత, ఆర్యవైశ్య సంఘం నాయకుడు చవల రామకృష్ణ పై బలవంతపు అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారంటూ ఆర్యవైశ్య సంఘాలు,స్థానికులు తీవ్ర నిరస రామకృష్ణ అరెస్ట్ ను ఖండిస్తున్న టిడిపి నాయకులు,రామకృష్ణ కు మద్దతుగా ఏకతాటిపై నిలిచేందుకు టీడీపీ నాయకులు నిర్ణయం కావలి లో కాలకూట విషం కక్కుతున్న ప్రజా మద్దతు లేని నెల్లూరు పొలిటికల్ లాబీయింగ్ నేత అంటూ జోరుగా ప్రచారం రామకృష్ణ పై అక్రమ కేసులకు వ్యతిరేకంగా భారీగా నిరసనలు తెలిపేందుకు సిద్ధం అంటున్న ఆర్య వైశ్య సంఘాలు,వ్యాపార సంఘాలు,ప్రజా సంఘాలు, నెల్లూరు టీడీపీ వాణిజ్య విభాగం నాయకుడు, కావలి ఏరియా ఆసుపత్రి డైరెక్టర్, కావలి ఆర్యవైశ్య సంఘం నేత చవల రామకృష్ణపై అక్రమ కేసు నమోదు కు తెర వెనుక నెల్లూరు రాజకీయ నాయకుడు జోక్యం ఉందంటూ ఆరోపణలుపోలీసు విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణతో చవల రామకృష్ణపై కేసు నమోదు చేసిన కావలి వన్‌టౌన్ పోలీసులు గత నెల రోజులుగా కావలిలో లేఔట్లపై విజిలెన్స్ అధికారుల వరుస దాడులు గురువారం కావలి డాక్యుమెంట్ రైటర్లను నెల్లూరుకి రావాలంటూ హుకుం జారీ చేసిన విజిలెన్స్ అధికారులు.. గురువారం రాత్రి 10 గంటల సమయంలో డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాల్లో ఉన్న హార్డ్ డిస్క్ లను విజిలెన్స్ అధికారులు బలవంతంగా తీసుకెళ్లినట్టు చెబుతున్న డాక్యుమెంట్ రైటర్లుఎవరో మెప్పుకోసం ఎంక్వైరీ పేరుతో అమాయకులను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆరోపణలు చట్టప్రకారం తప్పుచేసినట్టు పోలీసులకు పిర్యాదు వస్తే నోటీసులు ఇచ్చి పిలిస్తే పోలీసులకు సహకరిస్తాం కానీ ఇలా బలవంతంగా భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యం చేయడం ఏంటని వ్యాపారులు ఆగ్రహం పోలీసుల తీరుపై బగ్గుమంటున్న ఆర్యవైశ్య నాయకులు, సంఘాలు,చవల రామకృష్ణకు మద్దతుగా సంఘీభావం ప్రకటించిన వ్యాపార,ప్రజా సంఘాలు పోలీస్ స్టేషన్ ముట్టడికి సైతం వెనుకాడబోమని అంటున్న ఆర్యవైశ్య సంఘాలు లో చర్చచవల రామకృష్ణపై నమోదు చేసిన బలవంతపు,అక్రమ,రాజకీయ పరమైన కేసును వెంటనే ఉ పసంహరించుకోవాలని స్థానిక ప్రజల డిమాండ్ నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో టిడిపి నేత, ఆర్యవైశ్య సంఘాలు నాయకుడు కావలి ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ చవల రామకృష్ణ పై కావలి పోలీసులు, విజిలెన్స్ అధికారులు బలవంతపు అక్రమ కేసులు నమోదు చేయడంపై స్థానికంగా టిడిపి పార్టీ నేతల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది,ప్రజా మద్దతు లేని పొలిటికల్ లాబీయిస్ట్ అయిన నెల్లూరు "జిల్లా"రాజకీయ నాయకుడి కనుసన్నల్లో కావలి టీడీపీ నేత రామకృష్ణ పై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని దీనికి నిరసనగా కావలి పట్టణ ఆర్యవైశ్య సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్ర నిరసన కార్యక్రమాలు చేయాలని పోలీస్ స్టేషన్ ను సైతం ముట్టడించాలని, దీనికి సంబంధించి అంతర్గతంగా కార్యచరణ సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది, పోలీసులు విజిలెన్స్ అధికారులు చట్ట వ్యతిరేకంగా తమ విధులు నిర్వహించడం బాధాకరమని ఏదైనా ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇచ్చి తమను విచారించవచ్చని వీధి రౌడీల్లా బలవంతంగా తమ కార్యాలయాల్లో చొరబడి కంప్యూటర్ల లోని హార్డ్ డిస్క్ లు, స్వాధీనం చేసుకోవడం ఏంటని తాము వ్యాపారస్తుల మే కానీ తీవ్రవాదులం కాదని, కూటమి అధికారంలోకి వచ్చేందుకు తనవంతు ఎంతో కష్టపడి పని చేసిన టీడీపీ నాయకుడు రామకృష్ణ పై, వ్యాపారులపై రాజకీయ కక్షలు తగదని తమను ఇలా పోలీసులను అడ్డం పెట్టుకుని వేధిస్తామంటే కూర్చుని ఊరుకోమని త్వరలోనే తమ నాయకుడు రామకృష్ణ అరెస్ట్ కు వ్యతిరేకంగా రోడ్లపైకి వస్తామని కావలి టిడిపి నాయకులు, స్థానిక ప్రజలు, ఆర్యవైశ్య సంఘాలు ప్రజాసంఘాలు తెలియజేస్తున్నాయి.

# అడవి రాజుపాలెం రైల్వే అండర్‌పాస్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..





కావలి పెన్ పవర్ ( స్టాఫ్ రిపోర్టర్ ) మే :30 కావలి నియోజకవర్గ ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అడవి రాజుపాలెం రైల్వే అండర్‌పాస్ నిర్మాణ పనులను శనివారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మద్దూరుపాడు సమీపంలోని ఎల్‌సీ నెం.160 వద్ద జరుగుతున్న అండర్‌పాస్ నిర్మాణ పనులను రైల్వే అధికారులతో కలిసి సందర్శించిన ఎమ్మెల్యే,పనుల పురోగతిపై సమగ్రంగా ఆరా తీశారు.ఈ సందర్భంగా రైల్వే అధికారులు నిర్మాణ పనుల వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. అండర్‌పాస్ నిర్మాణంలో సాంకేతిక అంశాలు, పనుల పూర్తి గడువు, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులతో చర్చించారు. పనులు నాణ్యతతో పాటు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అండర్‌పాస్ నిర్మాణం పూర్తయితే మద్దూరుపాడు, పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో చేపట్టినట్లు ఎమ్మెల్యే చెప్పారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా అండర్‌పాస్ నిర్మించాలని అధికారులకు సూచించారు.ఈ అండర్‌పాస్ పూర్తయిన తర్వాత కావలి వైకుంటపురం,పెంకులు ఫ్యాక్టరీ ప్రాంత ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు అత్యవసర సేవల రాకపోకలు కూడా సులభతరం అవుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర సాధనకు ప్రజలందరూ సహకరించాలి





సూళ్లూరుపేట, పెన్ పవర్, మే 30 స్వచ్ఛ్ ఆంధ్ర-స్వర్ణాంధ్ర సాధనకు నియోజకవర్గ ప్రజలు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు.శనివారం సూళ్లూరుపేట పట్టణంలోని ఫిష్ మార్కెట్ ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో డాక్టర్ నెలవల విజయశ్రీ పారిశుధ్య కార్మికులతో కలిసి డ్రైనేజీ కాలువ పూడిక తీశారు.అనంతరం ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మున్సిపల్ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించిన"స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర" లక్ష్యం సాధనకు ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని,చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై అధికారులకు తగిన సూచనలు చేశారు.అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవేంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్,టీడీపీ నేత తిరుమూరు సుధాకర్ రెడ్డి,మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది,కూటమి నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆకుల సువార్తమ్మ ద్వితీయ జ్ఞాపకార్థ స్మారక కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి





కావలి పెన్ పవర్( స్టాఫ్ రిపోర్టర్ ) మే:30 జర్నలిస్ట్ హ్యాపీ తల్లి, పాస్టర్ యేసు బాబు సతీమణి ఆకుల సువార్తమ్మ ద్వితీయ జ్ఞాపకార్థ స్మారక కార్యక్రమం కావలి పట్టణంలోని కచ్చేరిమిట్టలోని వారి నివాసంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, ఆకుల సువార్తమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆమె సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సువార్తమ్మ కుటుంబ విలువలకు, ఆధ్యాత్మిక సేవలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆమె చూపిన ప్రేమ, సేవాభావం, మానవతా దృక్పథం కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా పరిచయస్తులకు కూడా ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.సువార్తమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ ఈశ్వరత్నం, కుటుంబ సభ్యులు, బంధువులు, క్రైస్తవ మత పెద్దలు, స్థానిక నాయకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆకుల సువార్తమ్మకు ఘన నివాళులర్పించారు.

# కౌన్సిల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ల ఆగ్రహం



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 30. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నబాబు, చైర్పర్సన్ సుప్రజా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొత్తం 19 అజెండాలను ప్రవేశపెట్టారు. వివిధ అంశాలపై కౌన్సిలర్లు ప్రశ్నలు అడగగా కమిషనర్ వాటికి సమాధానాలు ఇచ్చారు. అనంతరం అన్ని అజెండాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అయితే సమావేశంలో పలు వార్డుల అభివృద్ధి పనుల విషయంలో కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా కేవలం టిడిపి నాయకులను మాత్రమే పిలిపించి, వారి చేత ఫోటోలు తీయించి పనులు చేశామని ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. "అలా అయితే మేమెందుకు..? వారినే తీసుకొచ్చి కౌన్సిల్ సమావేశంలో కూర్చోబెట్టండి" అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఏ పని జరిగినా స్థానిక కౌన్సిలర్లకు ముందుగా సమాచారం ఇచ్చి, వారిని వెంట తీసుకుని వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వైసిపి కౌన్సిలర్లు కమిషనర్‌కు సూచించారు. పార్టీలు ఈరోజు ఉ ంటాయి, రేపు మారిపోతాయి కానీ స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం ప్రజల మధ్య ఎప్పుడూ ఉంటారని గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. అదేవిధంగా పలు వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని సమావేశంలో ప్రస్తావించారు. కొన్ని ప్రాంతాల్లో ఎర్రనీరు, మరికొన్ని చోట్ల నల్ల కుళ్ళులతో కలుషితమైన నీరు వస్తోందని కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ చిన్నబాబు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తొప్పాని రవికుమార్ పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



నాయుడుపేట,పెన్ పవర్, మే 30 నాయుడుపేట మండలంలోని జువ్వలపాలెం పంచాయతీ కార్మించి వారి కండ్రిక నివాసి తొప్పాని రవికుమార్ ను మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు.ఇటీవల తొప్పని రవికుమార్ తనయుడు యశ్వంత్ పిడుగుపాటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కారుమంచి వారి కండ్రిక గ్రామానికి చేరుకుని తొప్పాని రవికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి నాగిరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, యువజన అధ్యక్షులు పాలేటి నాగార్జున, నాయకులు నెల్లూరు వంశీ తదితరులు ఉన్నారు.

# మన నగరం - మన బాధ్యత ఆపరేషన్ క్లీన్ స్వీప్.. కమిషనర్ కె.మయూర్ అశోక్..





గుంటూరు, పెన్ పవర్, మే, 30, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' సాధనలో భాగంగా "ఆపరేషన్ క్లీన్ స్వీప్" రెండో వారం కార్యాచరణ మేరకు ఈనెల 30 నుండి జూన్ 4 వ తేదీ వరకు నగరంలోని అన్ని వార్డ్ ల్లో డ్రైన్ల క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టడంలో భాగంగా స్థానిక ఐపిడి కాలనీలోని సత్యసాయి ట్రస్ట్ వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ క్లీనింగ్ పనులను కమిషనర్ స్వయంగా పరిశీలించి, నగరంలోని అన్ని వార్డ్ ల్లో పూర్తి స్థాయిలో జరగాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నాలుగు వారాల ప్రత్యేక పారిశుధ్య కార్యాచరణలో భాగంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్రెండో వారం షెడ్యూల్ మేరకు ఈనెల 30 నుండి జూన్ 4 వ తేదీ వరకు నగరంలోని అన్ని వార్డుల్లో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. డ్రైన్లలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వేయడం వల్ల డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాన్నారు. డ్రైన్లలో చెత్త వేయడం వల్ల కలిగే నష్టాలపై వార్డుల వారీగా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గుంటూరు నగర స్వచ్ఛత కోసం జరిగే కార్యక్రమాల్లో నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం ద్వారా, మన నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చుకోవడంలో మన వంతు పాత్ర పోషిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, డిసిపీ సూరజ్ కుమార్, ఉపా సెల్ పిఓ సింహాచలం, మేనేజర్ బాలాజీ బాష, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఎస్ఎస్ లు, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, మే 30 : చిలకలూరిపేట : మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చొరవతో నియోజకవర్గంలోని బొప్పూడి, గోపాలవారిపాలెం,కట్టుబడివారిపాలెం, కావూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ. 2,86,342 విలువైన చెక్కులను చిలకలూరిపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్ చేతుల మీదుగా ప్రత్తిపాటి వారి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతోందన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు మరియు ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ఈ నిధి ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి సహాయ నిధిని మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

# బడుగు బలహీన వర్గాలను రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా బలపరిచిన వ్యక్తి అన్న నందమూరి తారక రామారావు.. రాచకొండ లక్ష్మయ్య..



గుంటూరు, పెన్ పవర్, మే, 30, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు ప్రజల గుండెల్లో మరణం లేని యుగ పురుషుడు అన్న నందమూరి తారక రామారావు అలాంటి వారి గురించి నీచంగా మాట్లాడుతాను నీకు నోరు ఎలా వచ్చింది దుర్మార్గానికి పాల్పడుతున్నావు ప్రజల నిన్ను క్షమించరు ఆలోచించుకో ఈ రోజు తెలంగాణ ఎమ్మెల్యే పృథ్వీరాజ్ ఎన్టీఆర్ సమాధి తవ్వేస్తాడట. .? ఉసేన్ సాగర్ లో కలిపేస్తాడాట.?ఎన్టీఆర్ సమాధి ఆంధ్రావాళ్ళు తవ్వుకొని వెళ్ళి ప్రకాశం బ్యారేజ్ మీద పెట్టుకోవాలట ..ఒరే నీవు మనిషివా.?తీవ్రవాదివా..?సమాధి త్రవ్వుకొని వెళ్ళడం ఏమిటి రా..?తెలంగాణ ఆడవారిని నగ్నం గా బతుకమ్మ లు ఆడించిన. నిజాం సమాధులు టచ్ చేసే దమ్ము ఉందా..?నీవు మనిషివి అవుతే..నీవు జపం చేస్తున్న తెలంగాణ వాదం నిజం అవుతే నీవు నిజాం సమాధి తవ్వాలి...తెలంగాణ సమాజం బానిస బ్రతుకు బ్రతికి వేల మంది చనిపోవడానికి కారణమైన వాడు నీకు దేవుడా...? తెలంగాణ లో రాజకీయ చైతన్యం తెచ్చి, పెత్తందారీ విధానాన్ని నిర్మూలించి,పేద ఆకలి తీర్చి,పట్వారీ వ్యవస్త నుండి ప్రజలకు రక్షించి,మహిళ లకు ఆస్తి హక్కు కల్పించి ఇలా వందల సంస్కరణ లు చేసి తెలంగాణ గౌరవం పెంచిన గొప్ప వ్యక్తి అలాంటి వారి సమాధి తవ్వుతా వా..? ఎవడివి రా నీవు..?ఎవడు ఇచ్చాడు నీకు అధికారం..?క్రాంతి దళం కాదు నీది . బెదిరింపులతో దోచుకునే దండుపాల్యం బ్యాచ్ నీది.ఎవడి కళ్ళ ల్లో ఆనందం కోసం..ఎవడి ఎంగిలి మెతుకుల కోసం నీవు ఈ చిల్లర మాటలు మాట్లాడుతున్నావో జనానికితెలుసు.బతుకమ్మ పేరుతో దోచింది ఎవరు..?కాళేశ్వరం పేరుతో దోచింది ఎవరు..ప్రాంతీయ వాదం తో దోచింది ఎవరు..,?ఉమ్మడి ఆంధ్రా ప్రదేశ్ మొత్తం దోచిన సైకో జగన్మోహన్ రెడ్డి కోసం నీవు నీతి సూత్రాలు చెప్పడం పెద్ద జోక్.. పది మంది తో నీవు తాటాకు చప్పుళ్ళు చేస్తే బయటపడటానికి తెలంగాణ గడ్డ మీద ఎవరూ లేరు. అమాయకపు తెలంగాణ సమాజాన్ని మోసం చేయడానికి తెలంగాణ ప్రజలు గొర్రెలు కాదురా అని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య హెచ్చరించారు

# మత్తుతో యువత విలువైన జీవితం చిత్తు కాకూడదు..

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు...





విజయవాడ, పెన్ పవర్, మే, 30, మాదక ద్రవ్యల మత్తుతో యువత విలువైన జీవితం చిత్తు కాకూడదని మాదకద్రవ్యల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్యాసంస్థలు, హాట్ స్పాట్ల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లా గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకై ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్ నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి సమన్వయం సమావేశం శనివారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో డ్రగ్స్పై దండయాత్ర విజయం, జిల్లాలో నిర్వహిస్తున్న విస్తృత అవగాహన కార్యక్రమాలు, ఈగల్ ఆపరేషన్స్, డీ అడిక్షన్ కేంద్రం సేవలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, హాట్స్పాట్స్ తనిఖీలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను సేవించే వ్యక్తిని మాత్రమే కాకుండా వారికి సంబంధించిన మొత్తం కుటుంబంపై తీవ్రంగా ప్రభావాన్ని చూపుతుందన్నారు. డ్రగ్స్ సేవించడం వలన శరీరం మనస్సు సమాజిక జీవితం చిన్న భిన్నమవుతుందన్నారు. శరీరక ఆనారోగ్యంతో పాటు గుండె జబ్బులు కాలేయం, ఊపిరితిత్తుల సమస్యల బారిన పడి రోగనిరోధక శక్తి తగ్గడం ద్వారా ప్రాణాపాయస్థితికి చేరుకోవాల్సి వస్తుందన్నారు. మానసిక ఆందోళన జ్ఞాపకశక్తి తగ్గడం ఏకాగ్రత లోపించడం తదితర కారణాలతో డిప్రెషన్కి లోనై కుటుంబ కలహాలు ఆర్థిక ఇబ్బందులతో పాటు చట్టపరమైన చిక్కులను ఎదురుకోవాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో డ్రగ్స్ ఆనవాళ్లను సమూలంగా తొలగించే సంకల్పంతో ఈగల్, పోలీస్, రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్యం తదితర సమన్వయ శాఖల భాగస్వామ్యంతో పెద్దఎత్తున నిర్వహించిన డ్రగ్స్పై దండయాత్ర విజయవంతమైందన్నారు. జిల్లాలోని గుర్తించిన సుమారు 150 హాట్స్పాట్ల్లో కీలకమైన ప్రాంతాల్లో రాత్రిపూట కూడా అత్యాధునిక నైట్ విజన్ డ్రోన్లతో నిఘా ఉంచాలని సూచించారు. మాదక ద్రవ్యాలపై పోరులో స్వచ్ఛంద సంస్థలు కూడా కీలక భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. 1972 టోల్ఫ్రీ నంబరు గురించి ప్రజలకు తెలియజేసేలా విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరముందన్నారు. మాదకద్రవ్య సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ చేయిచేయి కలిపి అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈగల్ స్టాల్స్తో ప్రజాబాహుళ్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మాదక ద్రవ్యలను సమూలంగా నివారించేందుకు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సూచించారు. పోలీస్ కమీషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థతో పాటు సమాజాన్ని అస్తవ్యస్తం చేసే మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్తాములు కావాలన్నారు. మాదక ద్రవ్యల సరఫరా వినియోగం చేసే వారిపై ఉక్కుపాదం మోపుతున్నామని పటిష్టమైన పోలీస్ నిఘాను ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని గురించి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యల నిర్మూలన వినూత్న కార్యక్రమాలను ఉద్యమంగా నిర్వహించి యువతలో అవగాహన కల్పిస్తున్నామని సీపీ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. హాట్స్పాట్ ప్రాంతాలతో పాటు రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లోనూ నిఘా పెంచాడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని వినూత్న కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక బద్దంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ చెల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు నివారణపై ప్న?ఫ్రలలో అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పోలీస్ కమీషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీపీ కేజీవీ సరిత, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి ఎం ఫణి దూర్జటి, డిఇవో చంద్రకళ. ఈగల్ అధికారులు ఎం.రవీంద్ర, సంక్షేమ శాఖ ముఖ్యకార్యనిర్వహణ అధికారి డా. కొల్లేటి రమేష్, హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఎం అనిల్ కుమార్, ప్రముఖ ఫిజియాలజిస్ట్ ఆకర్ష ఫౌండేషన్ సైకాలజిస్టులు డా. శంకర్రావు, నవజీవన్ బాల్ భవన్ ప్రతినిధి శేఖర్బాబు, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కో- ఆర్డినేటర్ ఆరవ రమేష్,వివిధ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు...

# తాగునీటి కష్టాలకు చెక్.. చెరువు అభివృద్ధికి శ్రీకారం

--- రూ.10 లక్షల వేలంపాట ఆదాయంతో చెరువు పూడికతీత

---ముంజులూరు చెరువు పూడికతీతతో గ్రామంలో కొత్త ఆశలు

--- చెరువు అభివృద్ధితో గ్రామానికి జలకళ

--- ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు



బంటుమిల్లి, పెన్ పవర్ ప్రతినిధి,మే 30 కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్లలోనే నియోజకవర్గ స్థాయిలో తాగునీటి సమస్య పరిష్కార దిశగా స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ దృష్టి సారించారు. గతంలో ఇదే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు అనంతరం అధికారులు ఆదేశాల మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. అయితే ఈ ఏడాది అలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గ్రామపంచాయతీ లోని మంచినీటి చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. వివరాల్లోకెళితే...... బంటుమిల్లి మండలం ముంజలూరు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలను వేధిస్తున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో గ్రామపంచాయతీ చెరువు పూడికతీత పనులను చేపట్టింది. చెరువు వేలంపాట ద్వారా వచ్చిన రూ.10 లక్షల ఆదాయాన్ని గ్రామాభివృద్ధి పనులకు వినియోగిస్తూ చెరువు పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం చెరువులో పేరుకుపోయిన మట్టి, పూడికను యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. దీంతో చెరువు నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.వర్షాకాలంలో చెరువులో ఎక్కువ మొత్తంలో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు నిర్వహిస్తున్నారు. చెరువులో నీటి నిల్వ పెరగడం వల్ల భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతో పాటు గ్రామంలోని బోర్లు, చేతి పంపులు, తాగునీటి వనరులకు కూడా ఉపయోగకరంగా మారనుంది. ప్రతి వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలకు ఈ చర్య ఎంతో ఉపశమనాన్ని కలిగించనుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.అలాగే చెరువు పూడికను రైతులు తమ వ్యవసాయ భూములకు తరలించుకోవడం ద్వారా నేల సారవంతం అవుతుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఒకవైపు చెరువు అభివృద్ధి, మరోవైపు రైతులకు ప్రయోజనం కలిగేలా ఈ కార్యక్రమం సాగుతోంది. గ్రామపంచాయతీ ఆదాయాన్ని అభివృద్ధి పనులకు వినియోగించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పనులు పూర్తయిన అనంతరం చెరువు మరింత విస్తీర్ణంలో నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని సంతరించుకోనుండగా, భవిష్యత్తులో తాగునీటి సమస్యను అధిగమించడానికి ఇది కీలకంగా మారనుందని అధికారులు తెలిపారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు వంటి అనేక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ పూడికతీత పనులు గ్రామానికి మేలు చేకూర్చనున్నాయని మండల అధ్యక్షుడు కూనపురెడ్డి వీరబాబు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు మార్కెటింగ్ భరోసా కల్పించాలి..జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...



విజయవాడ, పెన్ పవర్, మే, 30, పొదుపు సంఘాల మహిళలకు పారిశ్రామిక రంగంపై అవగాహన కల్పించి తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన రతన్ టాటా హబ్ (ఆర్టిహెచ్) పట్టణ స్వయం సహాయక సంఘం ( మెప్మా) మహిళలు సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా స్వయం ఉపాధి రంగంలో మరింత ముందుకు సాగేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. మెప్మా పొదుపు సంఘాల మహిళలు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు శనివారం కలెక్టరేట్లోని ఎవిఎస్ రెడ్డి సమావేశ మందిరంలో మెప్మా అధికారులు టౌన్ లెవల్ ఫెడరేషన్ ఏరియా లెవల్ ఫెడరేషన్ సభ్యులతో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరులలో 14 పట్టణ స్థాయి సమాఖ్యలు పనిచేస్తున్నాయన్నారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల నైపుణ్యాభివృద్ధి కోసం రతన్ టాటా హబ్ (ఆర్టిహెచ్) ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించి వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనదే లక్ష్యమన్నారు. ప్రభుత్వం పొదుపు సంఘాలలోని మహిళలకు ఒక్కొక్కరికి 10 లక్షల చొప్పున గ్రూపు మొత్తానికి 20 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు. మంజూరైన ఋణాలను సభ్యులు వ్యతిగత మరియు ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని ఇది ఎంత మాత్రము సమంజసం కాదన్నారు. తీసుకున్న రుణ సదుపాయాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి యూనిట్లను విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇందుకు రతన్ టాటా హబ్ ద్వారా శిక్షణ అందించి ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యంలో మహిళలను భాగస్వాములుగా చేయాలని మెప్మా సమాఖ్య సభ్యులకు సూచించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏడాదికి వెయ్యి కోట్లకుపైగా జీవనోపాధి రుణాలు మహిళలకు అందుతున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ స్వయం సమృద్ధితో సగర్వంగా నిలబడేలా చేయడంలో మహిళలకు చేయూతనివ్వాలని కోరారు. వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే ప్రతి యూనిట్ తప్పనిసరిగా జీఎస్టీ, ఏఫ్ఎస్టి తదితర సంబంధిత రిజిస్ట్రేషన్లు పొందాలని, చట్టబద్ధమైన విధానాలను పాటించడం ద్వారా వ్యాపార విస్తరణకు అవి మరింత దోహదపడతాయని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో వీఎంసి యుసిడి ప్రాజెక్టు ఆఫీసర్ చంద్రశేఖర్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి. మురళి కృష్ణప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మీనాక్షి కార్యదర్శి నజీమున్నీసా, జిల్లాలోని పట్టణ సమాఖ్యల అధ్యక్షులు మెప్మా సిబ్బంది ఎస్. సుధరాణి, ఎవిఎన్ సుగుణ, కె. కవిత, శ్రీ దుర్గా, శ్రీధర్ తదితరులు ఉన్నారు..

# నరసరావుపేటలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ముమ్మరం

## పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట, పెన్ పవర్ మే 30: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లాలో మే 22 నుంచి జూన్ 20 వరకు నాలుగు వారాల పాటు ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం నరసరావుపేట మున్సిపాలిటీ పరిధి లోని పెద్ద చెరువు ఒకటవ లైన్లో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, మున్సిపాలిటీ సిబ్బంది, ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ ద్వారా నరసరావుపేట మున్సిపాలిటీని మరింత స్వచ్ఛంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. నరసరావుపేట మున్సిపాలిటీ పల్నాడు జిల్లా కేంద్రం అయిన తర్వాత జనాభా గణనీయంగా పెరిగింది. దానికి అనుగుణంగా శానిటేషన్ సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. ఈ విషయాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభికి తెలియజేస్తామని పేర్కొన్నారు.

# ఫలోడి రోడ్డు ప్రమాదం కేసు సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు అమలు చేయండి

## జాతీయ రహదారులపై అక్రమ కట్టడాలు తొలగించండి : పల్నాడు జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సంజనా సింహ





నరసరావు పేట, పెన్ పవర్ మే 30: నరసరావుపేట: జిల్లాలోని జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను, నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సంజనా సింహ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్ నందు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావుతో కలిసి జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఫలోడి యాక్సిడెంట్ కేసులో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం జాతీయ రహదారుల క్యారేజ్‌వేలు లేదా పేవ్డ్ షోల్డర్లపై భారీ, వాణిజ్య వాహనాల అక్రమ పార్కింగ్‌ను పూర్తిగా నిషేధించాలని స్పష్టం చేశారు. అధునాతన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, జీపీఎస్ మానిటరింగ్ మరియు ఈ-చలాన్ల ద్వారా దీనిని పర్యవేక్షించాలన్నారు. రహదారుల వెంట ఉన్న అనధికారిక డాబాలు, తినుబండారాల దుకాణాలు, అక్రమ కట్టడాలను కంట్రోల్ ఆఫ్ నేషనల్ హైవేస్ యాక్ట్, 2002 ప్రకారం 60 రోజుల్లోగా తొలగించాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ?అదేవిధంగా, హైవే సేఫ్టీ జోన్లలో ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి వ్యాపార అనుమతులు మంజూరు చేయవద్దని, పాత లైసెన్సులను సమీక్షించాలని పేర్కొన్నారు. జిల్లాలో హైవే పెట్రోలింగ్, ప్రతి 75 కిలోమీటర్ల పరిధిలో బేసిక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు, రికవరీ క్రేన్లు మరియు ట్రక్ లే-బై (విశ్రాంతి గదులు, పార్కింగ్, ప్రథమ చికిత్స) సౌకర్యాలు ఉండేలా జాతీయ రహదారుల సంస్థ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద రహిత ప్రయాణం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో భాగమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని ఆమె గుర్తుచేశారు. గత సమావేశంలో చర్చించిన రొంపిచర్ల జంక్షన్ ఫ్లైఓవర్ ప్రతిపాదనలపై లీ అసోసియేట్స్ ఇచ్చిన నివేదికను సమీక్షిస్తూ, అక్కడ ప్రస్తుతం ఫ్లైఓవర్ సాంకేతికంగా సాధ్యం కానందున, తక్షణ భద్రతా చర్యలుగా ముందస్తు హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు (రుంబుల్ స్ట్రిప్స్), రహదారి మార్కింగ్స్ మరియు బ్లింకర్ లైట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గణపవరం మరియు తిమ్మపురం వద్ద హైమాస్ట్ లైట్ల మరమ్మతుల విషయంలో చిలకలూరిపేట మున్సిపాలిటీ అంగీకారం తెలిపినందున, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

బ్లాక్ స్పాట్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు

సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ, జిల్లాలో గుర్తించిన 35 బ్లాక్ స్పాట్స్ (ప్రమాద ప్రాంతాలు) వద్ద, వాహనదారులు సబ్ రోడ్డు నుండి ప్రధాన రహదారిలోకి ప్రవేశించే సమయంలో వేగాన్ని నియంత్రించడానికి ఖచ్చితంగా స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ వేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను కోరారు. ఆయా ప్రాంతాలలో హై-ఇంటెన్సిటీ లైటింగ్, స్పీడ్ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గత నెలలో పోలీస్ శాఖ కోరిన 15 బ్రీత్ అనలైజర్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, స్టాప్ అండ్ వాష్ వంటి కార్యక్రమాలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేస్తామని ఎస్పీ తెలిపారు. రవాణా శాఖతో కలిసి ఏప్రిల్ నెలలో 541 కేసులు నమోదు చేసి రూ.39 లక్షల పైగా జరిమానా వసూలు చేశామని, మే నెలలో ఓవర్‌లోడింగ్ వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 187 కేసులు నమోదు చేశామని వివరించారు.

జిల్లా హైవే సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కమిటీ నియామకం

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పల్నాడు జిల్లాలో జాతీయ రహదారుల భద్రత కోసం ప్రత్యేకంగా జిల్లా హైవే సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కమిటీ ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, ఎస్పీ కో-చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్, జాతీయ రహదారుల అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఆర్ అండ్ బి ఈఈ, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తూ నిరంతరం సమన్వయంతో పనిచేస్తారని వివరించారు. ప్రమాదాల డేటాను ఈ-డార్ ప్రాజెక్ట్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్ని శాఖలను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బొల్లా బ్రహ్మనాయుడు పై వస్తున్న ఆరోపణలు రాజకీయ దుష్ప్రచారమే -- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



నరసరావుపేట, పెన్ పవర్ మే 30: వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పై హైదరాబాద్‌లో భూమి కొనుగోలు వ్యవహారానికి సంబంధించి వస్తున్న ఆరోపణలను పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ శాసనసభ్యులుడాక్టర్‌గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లో సుమారు 10 ఎకరాల భూమి కొనుగోలు విషయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మోసపోయారని, భూమి అమ్మిన వ్యక్తులు ఫేక్ పత్రాలు, ఫేక్ జీవోలు చూపించి మోసానికి పాల్పడ్డారని తెలిపారు. కేవలం అగ్రిమెంట్ ఆధారంగా మాత్రమే డబ్బులు చెల్లించారని, ఇంకా భూమి రిజిస్ట్రేషన్ కూడా జరగలేదని స్పష్టం చేశారు. నాలుగు కోట్ల రూపాయలు చెల్లించిన వ్యక్తి మోసపోయాడా? లేక ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన వారు మోసపోయారా? అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని ఆయన అన్నారు. కొన్ని మీడియా సంస్థలు బ్రహ్మనాయుడు పారిపోయారంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. నిన్నటి వరకు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ప్రస్తుతం ముందస్తు బెయిల్ కోసం హైదరాబాద్‌కు వెళ్లారని తెలిపారు. ఒక భూమి వ్యవహారాన్ని రాజకీయ జీవితంతో ముడిపెట్టి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదని గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ వ్యవహారంలో న్యాయపరంగా పోరాటం చేస్తామని, నిజాలు వెలుగులోకి వస్తాయనివిశ్వాసంవ్యక్తం చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు తప్పు చేసి భయపడి పారిపోయే వ్యక్తి కాదని, కష్టపడిపనిచేసే నాయకుడని గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# మెగా డీఎస్సీపై వైసీపీ నిరాధార ఆరోపణలు మానాలి

## విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం తగదు

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట, పెన్ పవర్ మే 30: మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని, నిరుద్యోగ యువతను, విద్యార్థులను గందరగోళానికి గురిచేసే ప్రయత్నాలు మానుకోవాలని నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శనివారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించబడిందని ఆయన పేర్కొన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా పేపర్ లీక్, అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని విమర్శించారు. ఆరోపణలు చేస్తున్న వారికి నిజంగా ఆధారాలు ఉంటే సంబంధిత అధికార సంస్థలకు లేదా న్యాయస్థానాలకు సమర్పించాలని సూచించారు. గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలు ఒక డీఎస్సీ కూడా పెట్టలేదు అన్నారు. అలాంటిది కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు కల్పించామని అన్నారు. వైసీపీ జగన్ మోహన్ రెడ్డి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతగాని విమర్శలు చేయటం మానుకోవాలని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై వ్యక్తిగత విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, కానీ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. గతంలో నిలిచిపోయిన అనేక పనులను పూర్తి చేస్తూ పాఠశాలల మౌలిక వసతులు, ఉపాధ్యాయ నియామకాలు, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా అర్హత కలిగిన అభ్యర్థులకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి రాజకీయ విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ప్రచారాలు చేయకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక సూచనలు చేస్తే ప్రభుత్వం స్వాగతిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు.

# సంగినేడి బాలకృష్ణ ధర్మపత్ని శ్రీలక్ష్మి పెళ్లిరోజు సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం





పెన్ పవర్ కారంపూడి మే 30 :-- పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రతి శనివారం శ్రీ వాసవి సేవ అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో మహా అన్నదాన కార్యక్రమం భాగంగా ఈరోజు దాతలుగా సంగినేడి బాలకృష్ణ ధర్మపత్ని శ్రీలక్ష్మి పెళ్లిరోజు సందర్భంగా అన్నప్రసాద భోజనాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు బొమ్మిన శేషగిరిరావు తెలుగుదేశం పార్టీ నాయకులు తోట నరసింహారావు (అబ్బాయి) పలిశెట్టి కొండ పాల్గొన్నారు, సంగిరెడ్డి బాలకృష్ణ మాట్లాడుతూ అన్ని దానాల్లో మిన్న అన్నదాన కార్యక్రమం నారాయణ సేవ చాలా పుణ్యమైన కార్యక్రమాన్ని దాతలుగా అందరూ ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరారు, ఈ నారాయణ సేవా కార్యక్రమంలో అన్న ప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, అన్న ప్రసాద మహిళా కమిటీ సభ్యులు చిన్ని లక్ష్మి, సముద్రాల పద్మ, బళ్లారి పార్వతి, చింతల శారద, ఆతుకూరి అంజిని, సూరే ధనలక్ష్మి, పల్లా పద్మ, యక్కల రమాదేవి, చిన్ని అనంతలక్ష్మి, గుండా మహేశ్వరి తదితరులు ఈ నారాయణ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు

# యువకుడు అనుమానాస్పద మృతి






బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మే 30. బుచ్చిరెడ్డిపాలెం మండలం పోలినాయుడు చెరువు గ్రామంలో పఠాన్ నాగూర్(48) వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. అతని ఇంటి వెనకాల స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు రూరల్ డిఎస్పి గట్టమనేని శ్రీనివాసరావు సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే మృతదేహం పై గాయాలు ఉండడంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్ టీం డాగ్స్ స్క్వాడ్ ద్వారా ఆధారాలను సేకరించారు. ఘటనకు గల కారణాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది. అని బుచ్చిరెడ్డిపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు

# లోకేశ్ ను రాజకీయంగా ఎదుర్కోలేకనే, జగన్ కొత్త కట్టుకథలు : ప్రత్తిపాటి

## తనవల్ల కాని అసాధ్యాలను లోకేశ్ ఆచరణ సాధ్యం చేయడాన్ని జగన్ భరించలేకపోతున్నాడు : ప్రత్తిపాటి

## ఈర్ష్య అసూయతోనే డీఎస్సీలో అక్రమాలంటూ గగ్గోలు పెడుతున్నాడు. : ప్రత్తిపాటి

## ఏ ఆధారాలతో జగన్.. వైసీపీనేతలు డీఎస్పీపై ఆరోపణలు చేస్తున్నారు? : ప్రత్తిపాటి

## అబద్ధాలు..అడ్డగోలు విమర్శలతో పరపతి పెంచుకోవాలన్నదే జగన్ ప్రయత్నం : ప్రత్తిపాటి

## 33 శాతం రిజర్వేషన్లు, తరిగిపోని మహిళాభిమానంతో లోకేశ్ తిరుగులేని నాయకుడు అవుతాడు : ప్రత్తిపాటి




చిలకలూరిపేట , పెన్ పవర్, మే 30 : చిలకలూరిపేట : కూటమిప్రభుత్వంలో, టీడీపీలో జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్న మంత్రి నారా లోకేశ్ ను రాజకీయంగా ఎదుర్కోవడం అసాధ్యమని తెలిసే.. జగన్, వైసీపీనేతలు డీఎస్సీలో అక్రమాలంటూ కొత్త కట్టుకథలు మొదలుపెట్టారు. జగన్ ఐదేళ్లలో సాధించలేని నిరుద్యోగుల దశాబ్దాల కలను, లోకేశ్ కేవలం 150 రోజుల్లో నిజం చేశారు. 16,347 పోస్టుల భర్తీతో ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాల్లో శాశ్వత వెలుగులు నింపారు. తనవల్ల కాని ఇలాంటి అసాధ్యాలను లోకేశ్ ఆచరణ సాధ్యం చేస్తూ, ప్రజల మనసులు గెలుస్తున్నాడన్న అక్కసు, భరించలేని ఈర్ష్య, అసూయతోనే జగన్ డీఎస్సీలో అక్రమాలంటూ గగ్గోలు పెడుతున్నాడు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగినట్టు జగన్ కు పగటి కల వచ్చిందా? లేక ఆయనకు మాత్రమే కనిపించే ఆత్మలేమైనా చెప్పాయా? డీఎస్సీకి సన్నద్ధులై, మోసపోయిన అభ్యర్థులెవరైనా ఆయన్ని కలిసి తగిన సాక్ష్యాధారాలిచ్చి, తమకు అన్యాయం జరిగిందని చెప్పారా? ఏ ఆధారాలతో జగన్.. వైసీపీ నేతలు డీఎస్సీలో అక్రమాలని విషప్రచారం చేస్తున్నారు? వారివద్ద ప్రభుత్వం తప్పుచేసినట్టు సరైన ఆధారాలుంటే, న్యాయస్థానాలను ఆశ్రయించైనా నిరుద్యోగులకు న్యాయం చేయవచ్చు కదా! జగన్ విధానం మొదటినుంచీ అదే. ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ లపై బురదజల్లడం.. తప్పించుకు తిరగడం. అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై, ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలపై మాట్లాడే ధైర్యం లేని జగన్.. అబద్ధాలు, అసత్యాలతో అడ్డగోలు విమర్శలతో ప్రజల్లో పరపతి పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు.

33 శాతం రిజర్వేషన్ల నిర్ణయంతో లోకేశ్ 'రియల్ హీరో' అయ్యాడు

కేంద్రప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును అమలుచేసినా, చేయకపోయినా పార్టీలో, పదవుల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామన్న మంత్రి లోకేశ్ నిర్ణయంపై నారీమణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మహానాడు వేదికపై ప్రకటించిన అనూహ్య నిర్ణయంతో లోకేశ్ మహిళల రియల్ హీరో అయ్యాడు. వెలకట్టలేని, ఎప్పటికీ తరిగిపోని మహిళాభిమానంతో ఆయన తిరుగులేని భావినాయకుడు కానున్నారు. మగువల మనసెరిగి, వారి ప్రేమాభిమానాలు పొందేలా వ్యవహరిస్తున్న లోకేశ్ ఆలోచనావిధానంతో పోలిస్తే.. ఆస్తికోసం తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్ ఎందుకు పనికొస్తాడంటూ అక్కచెల్లెళ్లు వైసీపీ అధినేతపై దుమ్మెత్తిపోస్తున్నారు. నా అక్కచెల్లెళ్లు అంటూ నమ్మించి నట్టేటముంచాడని శాపనార్థాలు పెడుతున్నారు." అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# పేట పోక్సో కేసులో నిందితుడికి 3 ఏళ్ల శిక్ష

## విశాఖ స్పెషల్ హోమ్‌కు తరలింపు



చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, మే 30 : చిలకలూరిపేట :2022లో పేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక ఐదేళ్ల బాలికపై పోక్సో కేసులో నిందితుడికి కోర్టు మూడు సంవత్సరాల శిక్ష విధించింది. ఈ శిక్షా కాలాన్ని అనుభవించేందుకు నిందితుడిని విశాఖపట్నంలోని స్పెషల్ హోమ్‌కు పంపాలని గుంటూరు జువైనల్ జస్టిస్ బోర్డు( ఫోర్త్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి) న్యాయమూర్తి శోభారాణి ఉత్తర్వులు జారీ చేశారు. చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన ఓ మహిళ తన 5 ఏళ్ల కుమార్తెను అమ్మమ్మ వద్ద వదిలి వెళ్లిన సమయంలో ఈ ఘోరం జరిగింది. బాలిక రోడ్డుపై ఆడుకుంటుండగా, నిందితుడు ఆమెను పక్కనే ఉన్న నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి తీసుకెళ్లి వేధించాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ ఎస్సై వి. బాలకృష్ణ కేసు నమోదు చేయగా, నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ యు. రవిచంద్ర దర్యాప్తు పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేశారు.

పోలీస్ అధికారులకు ఎస్పీ అభినందనలు

పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఐపీఎస్ ఆదేశాల మేరకు అమలువుతున్న "ట్రైల్ కేసుల ప్రత్యేక పర్యవేక్షణ" ఈ కేసులో సత్ఫలితాలను ఇచ్చింది. నరసరావుపేట డిఎస్పీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో, చిలకలూరి రూరల్ సీఐ బి. సుబ్బనాయుడు బృందం కోర్టులో సరైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.ఎస్.ఎస్. సుకుమార్ గారు కేసు నిరూపణలో కీలక పాత్ర పోషించారు. నిందితుడికి శిక్ష పడేలా శ్రమించిన పోలీస్ అధికారులు, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు.

# ఆ మూడు తప్ప... వైసీపీ టార్గెట్ 172

**విజయవాడ, మే 30, పెన్ పవర్:** వైసీపీ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడుతోంది. నిన్న తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయకర్తలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకునేది లేదని.. ఏకంగా నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు పడుతుందని హెచ్చరించినంత పని చేశారు. అయితే అక్కడే ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు.. బాధ్యతలు చూస్తున్న తమపై కాదు.. ఆ కీలక నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి అన్నట్టు అంతర్గత చర్చల్లో చెబుతున్నారు వైసీపీ నేతలు. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి, పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కనీసం వైసిపి ఉనికి లేదు. నేతల జాడలేదు. ముందుగా అక్కడ పని చూడండి అన్నట్టు వైసిపి నేతల సూచన ఉంది. గత రెండేళ్లలో ఆ మూడు నియోజకవర్గాల్లో వైసిపి చేసిన కార్యక్రమం అంటూ లేకపోవడం విశేషం.వై నాట్ కుప్పం అంటూ సౌండ్ చేశారు వైసీపీ నేతలు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా కుప్పంను గెలిచేస్తాం అంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటివారు పెద్దదిక్కుగా మారిపోయారు. తన పుంగనూరు విడిచిపెట్టి మరి కుప్పం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. భరత్ అనే నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. చంద్రబాబును సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టనీయలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క పదవి కూడా వదలకుండా అంతా తీసుకున్నారు. అభివృద్ధి పనులు కూడా పగబట్టి మరీ చేశారు. కానీ కుప్పం ప్రజలు మాత్రం మళ్లీ చంద్రబాబునే పట్టం కట్టారు. ప్రస్తుతం అక్కడ వైసిపి ఇన్చార్జిగా ఉన్న భరత్ జాడలేదు. వైసిపి కార్యక్రమాలు జరగడం లేదు. పట్టించుకునే నాథుడు కూడా అక్కడ లేడు.ఇక మంగళగిరి విషయానికి వస్తే లోకేష్ మానియా నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి లోకేష్ వినూత్న తరహాలో ముందుకు వెళ్తున్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఎంతలా అంటే ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా. 2019లో ఓడిపోయిన తర్వాత సొంత ఖర్చుతో అభివృద్ధి చేసి చూపించారు. ఇప్పుడేమో ప్రభుత్వపరంగా చేసి చూపిస్తున్నారు. గతంలో ఉన్న వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి జాడలేదు. మొన్న పోటీ చేసిన మహిళా నేత కనిపించడం లేదు. పైగా అక్కడ మాజీ మంత్రి ఒకరు లోకేష్ పట్ల అనుకూల ప్రకటనలు చేస్తున్నారు.పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు లేవు. మొన్నటి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు ముద్రగడ పద్మనాభం. అయితే ఓడించలేక తన పేరు మార్చుకున్నారు ముద్రగడ పద్మనాభ రెడ్డి గా. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెండ్యం దొరబాబు సైతం జనసేనలోకి వచ్చేసారు. పవన్ కళ్యాణ్ పై పోటీ చేసిన వంగా గీత ఆచూకీ లేదు. కనీసం అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు లేవు. ఈ మూడు చోట్ల ముందు చూడండి.. తరువాత మాట్లాడండి అన్నట్టు ఉంది వైసీపీ నేతల వ్యవహార శైలి.

**గుడివాడలో నాని చేతులెత్తేశారా....**

మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వైఎస్ జగన్ తో జరిగిన సమావేశంలో పాల్గొన్న కొడాలి నాని గుడివాడకు మాత్రం వెళ్లలేదు. 2024 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత కొడాలి నాని గుడివాడకు దూరమయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గుండెకు శస్త్ర చికిత్స జరగడం కొడాలి నాని హైదరాబాద్ కు మాత్రమే పరిమితమయ్యారు. ఏదైనా పోలీస్ స్టేషన్ కు రావాల్సినప్పుడే గుడివాడకు వస్తున్నారు తప్పించి అంతకు మించి ఆయన ప్రత్యేకంగా గుడివాడ వచ్చి వైసీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనలేదు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంత వరకూ గుడివాడలో కార్యకర్తలతో భేటీ కూడా జరపలేదు.కొడాలి నాని మాత్రం గుడివాడలోని తన ముఖ్య అనుచరులతో టచ్ లోనే ఉన్నారు. హైదరాబాద్ లోనే ఎక్కువ కొడాలి నాని ఉంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో ఇప్పుడే రావడం అనవసరమని కొడాలి నాని భావిస్తున్నట్లుంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మే నెలలో తలనీలాల రికార్డు

**తిరుమల, మే 30, పెన్ పవర్:** తిరుమలలో తలనీలాల సమర్పణలో ఏటికేడు కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. మే నెలలో గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయిలో తలనీలాల సమర్పణ జరిగినట్లు తెలిపింది. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా కళ్యాణకట్టల వద్ద ఏర్పాట్లు చేశామని.. పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది.తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే మే నెలలో కొత్త రికార్డులు నమోదు చేసింది. గత సంవత్సరాల కంటే 2026 మే నెలలో అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేపట్టి, నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఇక ఈ ఏడాది మే నెలలో 14,43,063 మంది భక్తులు తిరుమల శ్రీవారికి తమ తలనీలాలు సమర్పించుకున్నారు. 2024 మే నెలలో 10,65,729 మంది భక్తులు, 2025 మేలో 10,18,370 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుంటే.. ఈ ఏడాది మే నెల కొత్త రికార్డులు నమోదు చేసింది.మరోవైపు ఇటీవల వేసవి సెలవులు, వారాంతపు రద్దీతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. మే 18వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు వరుసగా ఆరు రోజుల పాటూ రోజూ 50 వేల మందికిపైగా భక్తులు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరీ ముఖ్యంగా మే 23వ తేదీ ఒక్కరోజే 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తలనీలాల సమర్పణకు ఎక్కువ సమయం పట్టకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.ప్రధాన కళ్యాణకట్ట సహా పీఏసీ-1, పీఏసీ-2, పీఏసీ-3, పీఏసీ-5, జీఎన్సీ, హెచ్‌వీసీ, సప్తగిరి, నందకం, కౌస్తుభం, శ్రీవేంకటేశ్వర, శ్రీ పద్మావతి విశ్రాంతి గృహాలతో పాటుగా మొత్తం 11 మినీ కళ్యాణకట్టలు భక్తులకు అందుబాటులో ఉంచినట్లు టీటీడీ తెలిపింది. మొత్తం 1152 మంది క్షురకులు, అందులో 269 మంది మహిళా క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నట్లు వెల్లడించింది. ఒక్కొక్కరు తమ 6 గంటల షిఫ్టులో 40 మందికి సేవ చేస్తారని తెలిపింది. మరోవైపు భక్తుల రద్దీకి అనుగుణంగా 250 మంది సిబ్బందికి అదనంగా విధులు కేటాయించినట్లు వెల్లడించింది.మరోవైపు తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులు కళ్యాణకట్టను అత్యంత పవిత్రంగా భావిస్తుంటారని.. అందుకే భక్తులకు ఇబ్బందులు కలగకుండా కళ్యాణకట్టలో పరిశుభ్రతకు పెద్దపీట వేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులకు కేటాయించే బ్లేడ్లు కూడా ముందుగా సోడియం సొల్యూషన్ లో ముంచి, డెటాయిల్‌తో శుభ్రపరుస్తున్నట్లు తెలిపింది. భక్తులు సమర్పించే తలనీలాలను ఎప్పటికప్పుడు సేకరించి భద్రపరుస్తున్నట్లు తెలిపింది. తలనీలాల సమర్పణ తర్వాత చందనం బిళ్లలు కూడా అందిస్తున్నట్లు వివరించింది.

## కాబోయే అల్లుడికి ట్రాఫిక్ ఉల్లంఘనలా... ఇదేమి అంటూ ప్రశ్న

**కాకినాడ, మే 30 పెన్ పవర్:** ళ్లికాని అబ్బాయిలూ మీకో ముఖ్యమైన గమనిక.. మీకు పిల్లనివ్వబోయే మామ మీ ఉద్యోగం, ఆస్తి, అలవాట్ల గురించి మాత్రమే కాదు.. మీపై ట్రాఫిక్ చలానాలు ఉన్నాయో కూడా తెలుసుకుంటున్నారు. మీరు ఉంటున్నది నిజమే.. తాజాగా కాకినాడకు చెందిన ఓ వ్యక్తి తనకు కాబోయే అల్లుడి గురించి ఆరా తీస్తే.. అతడిపై ట్రాఫిక్ చలానాలు ఉన్నాయా, లేదా కూడా ఆరా తీశఆరు.సాధారణం ఆడపిల్లకు పెళ్లి సంబంధాలు చూసే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటారు. పెద్దవాళ్లు చెప్పినట్లుగా అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాల సంగతి పక్కన పెడితే.. అబ్బాయి గుణగణాలు, అలవాట్లు వంటి అంశాలను తెలుసుకునే ప్రయత్నం కచ్చితంగా చేస్తుంటారు. కొంతమంది అబ్బాయి జీతం ఎంత, ఆస్తి ఎంత అని కూడా ఆరా తీసేవాళ్లు ఉంటారు. తమ బిడ్డ భవిష్యత్ బావుండాలనే ఉద్దేశంతోనే అమ్మాయి తల్లిదండ్రులు ఇలా అబ్బాయి గురించి ఎంక్వైరీ చేస్తుంటారు. కానీ కాకినాడ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మాత్రం అలా కాదు.. తనకు కాబోయే అల్లుడి గురించి ఆరా తీసేందుకు.. విచిత్రంగా యువకుడు నడిపే బైక్, కారుపై ఏవైనా చలానాలు ఉన్నాయి అంటూ ఆరా తీశారు. నేరుగా సీఐ దగ్గరకు వెళ్లి కాబోయే అల్లుడి గురించి అడిగి తెలుసుకున్నారు.కాకినాడలోని రాయుడుపాలేనికి చెందిన ఓ వ్యక్తి కూతురికి పెళ్లి చేద్దామని ఓ సంబంధం చూశారు. ఈ క్రమంలో తనకు కాబోయే అల్లుడి గురించి తెలుసుకోవాలనుకున్నారు. కాకపోతే ఆయన ఆ యువకుడి గుణగణాలు తెలుసుకోవడంతో పాటుగా కాస్త వినూత్నంగా ఆలోచించారు. తనకు కాబోయే అల్లుడు ట్రాఫిక్ నిబంధనలు ఎలా పాటిస్తున్నాడా.. వాహనాలు ఎలా నడుపుతున్నాడో తెలుసుకోవాలనుకున్నారు. రెండు రోజుల కిందట కాకినాడ భానుగుడి దగ్గర విధుల్లో ఉన్న ట్రాఫిక్-2 సీఐ డి రామారావును ఆయన కలిశారు. తనకు కాబోయే అల్లుడికి ఓ కారు, ఓ బైక్ ఉందని.. వాటి రిజిస్ట్రేషన్ నంబర్ల వివరాలు సీఐకి ఇచ్చారు. ఈ రెండు వాహనాలపై ఏమైనా చలానాలు ఉన్నాయేమో చెక్ చేయాలని కోరారు. ఒకవేళ ఈ వాహనాలపై చలానాలు ఉంటే కనుక తన కుమార్తెను ఇచ్చి పెళ్లి చేయనని సీఐతో చెప్పారు. ఆయన చెప్పిన మాటతో సీఐ కూడా అవాక్కయ్యారు.సీఐ రామారావు వెంటనే స్పందించి.. ఇలా ఎందుకు చేస్తున్నారు, కాబోయే అల్లుడి వాహనాలపై చలానాల గురించి ఎందుకు ఆరా తీస్తున్నారని ఆయనను అడిగారు. తన భార్య చనిపోయిందని.. తనకు ఒక్కగానొక్క కుమార్తె ఉందన్నారు. ఆమెను అల్లారుముద్దుగా పెంచుకున్నానని.. ఆమెకు పెళ్లి చేసే సమయంలో, అన్నీ చూసుకోవాలి కదా అన్నారు. అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాతే ఆ అబ్బాయి చేతిలో పెట్టాలని అనుకుంటున్నానన్నారు. ఇలా ఆ తండ్రి కూతురిపై ఉన్న ప్రేమను వ్యక్తపరిచారు. తనకు కాబోయే అల్లుడు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా తాను భావిస్తానన్నారు. అప్పుడు తన కుమార్తెను బాగా చూసుకుంటాడని తనకు నమ్మకం ఉంటుందని సీఐ రామారావుతో చెప్పారు.వెంటనే సీఐ రామారావు కూడా చాలా పాజిటివ్‌గా స్పందించారు. ఆయన ఇచ్చిన రెండు నంబర్లతో చెక్ చేసి.. ఆ రెండు వాహనాలపై ఎలాంటి చలానాలూ లేవని చెప్పారు. దీంతో ఆయన చాలా ఆనందంగా అక్కడి నుంచి వెళ్లారు. కూతురి భవిష్యత్ కోసం ఒక తండ్రిగా చాలా గొప్పగా ఆలోచించారని.. ప్రతి ఒక్కరూ ఇలా ఆలోచిస్తే బావుటుందని సీఐ రామారావు అన్నారు. మొత్తం మీద కాకినాడకు చెందిన పెద్దాయన తన కూతురి భవిష్యత్ కోసం ఇంత దూరం ఆలోచించారా అంటూ చర్చించుకుంటున్నారు.

## కృష్ణా , విజయనగరం రైతులకు జపాన్ ఎఫెక్ట్...

**విజయవాడ, మే 30, పెన్ పవర్:** భారత మామిడి పండ్లపై జపాన్ ప్రభుత్వం విధించిన తాజా నిషేధం ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా ఉమ్మడి కృష్ణా, ఖమ్మం విజయనగరం జిల్లాల మామిడి రైతులకు మరియు ఎగుమతిదారులకు పెద్ద షాక్‌గా మారింది. ఏపీలో అత్యధికంగా పండే, ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్న 'బంగినపల్లి' రకం మామిడి కాయల ఎగుమతులపై ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బ తీయనుంది. జపాన్ మార్కెట్‌లో ఏపీ మామిడి పండ్లకు చాలా ఎక్కువ ధర లభిస్తుండటంతో, ఈ నిషేధం వల్ల ఇక్కడి వ్యాపారులు, రైతులు కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.నిజానికి ఏపీ నుండి జపాన్‌కు మామిడి కాయలను ఎగుమతి చేసే ముందు నాణ్యతా ప్రమాణాల కోసం వాటికి వేపర్ హీట్ ట్రీట్మెంట్ చేయడం తప్పనిసరి. అయితే, ఉత్తరప్రదేశ్‌లోని ఒక ట్రీట్మెంట్ ప్లాంట్‌లో క్వారంటైన్ నిబంధనలు, పురుగుల నివారణ ప్రక్రియల్లో లోపాలు ఉన్నట్లు జపాన్ ఫుడ్ అఫీషియల్స్ గుర్తించారు. జపాన్ దేశం పండ్ల ఈగల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తుంది. ఒక ప్రాంతంలో లోపం జరిగినా, దాని ప్రభావం దేశవ్యాప్త ఎగుమతులపై పడటంతో ఏపీలోని అత్యాధునిక ప్యాక్ హౌస్‌ల ద్వారా ఎగుమతి చేసే రైతులు కూడా ఇప్పుడు నష్టపోవాల్సి వస్తోంది.ఈ ఏడాది ఇప్పటికే ఏపీలోని మామిడి రైతులకు వాతావరణం ఏమాత్రం కలిసిరాలేదు. ఎల్ నినో ప్రభావం వల్ల మార్చి, ఏప్రిల్ నెలల్లో నమోదైన విపరీతమైన ఎండలు, అకాల వాతావరణ మార్పుల కారణంగా పూత ఎండిపోయి, కాయ రాలిపోయి ఇప్పటికే 60 శాతం పైగా పంట నష్టం వాటిల్లింది. దిగుబడి తగ్గి కష్టాల్లో ఉన్న రైతులకు, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర దక్కుతుందనే ఆశ ఉండేది. కానీ కచ్చితంగా సీజన్ పీక్ స్టేజ్‌కు చేరే సమయంలో జపాన్ ఈ నిషేధాన్ని విధించడం ఏపీ మామిడి రైతులకు గోరుచుట్టుపై రోకటిపోటులా మారింది.ఇప్పుడు ఏపీ ఎగుమతిదారులు భయపడుతున్న మరో ముఖ్యమైన అంశం ఏంటంటే.. జపాన్ తీసుకున్న ఈ కఠిన నిర్ణయం వల్ల అంతర్జాతీయంగా భారతీయ క్వాలిటీ కంట్రోల్ సిస్టమ్స్‌పై నమ్మకం తగ్గే అవకాశం ఉంది.

## జగన్ వార్నింగ్.. కేడర్ కు డబ్బు భయం? స్థానిక సమరంపై వైసీపీలో తర్జనభర్జన



**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గతంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయని అంటున్నారు. ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా రాష్ట్రంలో ప్రతి స్థానం నుంచి పోటీ చేయాలని వైసీపీ బాస్ జగన్ పార్టీ కేడర్ ను ఆదేశించారు. ప్రధానంగా ఏ నియోజకవర్గంలో అయినా పోటీకి అభ్యర్థులు లేరన్న సాకు చూపకూడదని, అవసరమైతే బీసీ, ఎస్సీ కార్యకర్తలను రంగంలోకి దింపాలని జగన్ రెడ్డి సూచించారు. దీంతో స్థానిక ఎన్నికల్లో పార్టీ పట్టు నిరూపించుకోవాలని జగన్ రెడ్డి తహతహలాడుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంలో కేడర్ మాత్రం భిన్నంగా స్పందిస్తున్నట్లు అంతర్గత సంభాషణల్లో తెలుస్తోందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంపై రాజీ లేని పోరాటం చేస్తున్న వైసీపీ కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో పోటీపై మాత్రం తీవ్ర తర్జనభర్జనకు గురవుతున్నారని అంటున్నారు. దీనికి ప్రధాన కారణం ఎన్నికల వ్యవస్థ డబ్బు మయంగా మారిపోవడమే అంటున్నారు. చిన్న పంచాయతీలో సర్పంచ్ పదవికి పోటీపడాలన్నా ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఖర్చు పెట్టాల్సివుంటుందని అంటున్నారు. అంత డబ్బు పెట్టి గెలిచినా, ప్రతిపక్షంలో ఉండటం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే సమయంల ప్రస్తుతం నెలకొన్ని ఆర్థిక ఇబ్బందులు కూడా దిగువస్థాయి కేడర్ ను భయపెడుతోందని అంటున్నారు. రానున్న రెండు మూడు నెలల్లో స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినందున ఈ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వంపై సానుకూల వాతావరణమే ఉందని ప్రభుత్వం చాటి చెప్పాలని అనుకుంటోంది. ఇదే సమయంలో వైసీపీ కూడా గట్టి వ్యూహంతోనే ముందుకు కదులుతోందని అంటున్నారు. స్థానిక ఎన్నికల్లో ఎక్కడా అధికార పార్టీకి తలొగ్గామనే అభిప్రాయం వ్యక్తం కావొద్దని, ప్రతిచోట అధికార పక్షాన్ని దీటుగా ఢీకొట్టాలని వైసీపీ హైకమాండ్ భావిస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఇంచార్జులను యాక్టివ్ చేసింది. ఎన్నికల్లో ప్రతి చోటా అభ్యర్థులను నిలిపే బాధ్యత నియోజకవర్గ ఇంచార్జిలకు అప్పగించింది. అయితే సర్పంచ్, ఎంపీటీసీ వంటి పదవులకు పోటీ చేయడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నప్పటికీ డబ్బు సమస్యే వారిని ఊగిసలాటకు గురిచేస్తోందని చెబుతున్నారు. విపక్షంలో ఉండటం వల్ల గెలిచినా, గెలవకపోయినా పెద్దగా ప్రయోజనం ఉండదని ఎక్కువ మంది నేతలు అభిప్రాయపడు తున్నట్లు చెబుతున్నారు. లక్షల రూపాయలు కుమ్మరించి పోటీ చేసి ఆర్థిక ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకు? అన్న ఆలోచనలో ఎక్కువమంది ఉన్నారని అంటున్నారు. అయితే పార్టీ అగ్ర నాయకత్వం మాత్రం ఎట్టిపరిస్థితుల్లో పోటీ చేయాల్సిందే అని పట్టుబడటం వల్ల చాలా మంది నియోజకవర్గ ఇంచార్జిలు ఏమైనా సాయం చేస్తారా? అని ఆశగా ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో హైకమాండ్ స్పష్టత ఇస్తే క్షేత్రస్థాయిలో పోటీకి పెద్ద ఎత్తున కార్యకర్తలు ముందుకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

## ఫేక్ జీవోలతో రూ.1500 కోట్ల భూమికి ఎసరు? వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడిపై కేసు




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని గండిపేటలో రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ప్రయత్నించారని వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై నమోదైన కేసు సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుతోపాటు నలుగురు పరారీలో ఉన్నారని, మరో ముగ్గురిని అరెస్టు చేశామని శేరిలింగంపల్లి డీఎస్పీ చింతమనేని శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. దీంతో ఈ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. గండిపేటలో సుమారు రూ.1500 కోట్ల విలువైన కబ్జాపై మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వస్తున్నాయి. ఇందులో ప్రమేయం ఉందంటూ మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు రావడంతో ఆయన పరార్ అయ్యారని, ఆయన కోసం గాలిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. దీంతో ఈ వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారంగా మారుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. శేరిలింగంపల్లి డీఎస్పీ చింతమనేని శ్రీనివాస్ కథనం ప్రకారం హైదరాబాద్ శివార్లలోని గండిపేటలో సుమారు రూ.1500 కోట్ల విలువైన భూములను కాజేందుకు కొందరు స్కెచ్ వేశారని స్థానిక ఎమ్మార్వో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో మొత్తం ఏడుగురి పాత్ర ఉందని గుర్తించగా, వారిలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేరు చేర్చడంతో రాజకీయ సంచలనంగా మారిందని అంటున్నారు. గండిపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 18లో మొత్తం 104.25 ఎకరాలు ఉండగా, అందులో 9.28 ఎకరాలను గండిపేటకు చెందిన ఐదుగురు వ్యక్తులు తప్పుడు పత్రాలతో క్రమబద్ధీకరించుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ విషయం స్థానిక తహశీల్దార్ దృష్టికి వెళ్లిందని, ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని తహశీల్దార్ ఫిర్యాదు చేశారని డీఎస్పీ వెల్లడించారు. దీంతో నార్సింగి పోలీసులతోపాటు సైబర్ క్రైం, ఆర్థిక నేరాల విభాగం పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు నిర్వహించి కబ్జా కుట్రను భగ్నం చేసినట్లు డీఎస్పీ మీడియాకు వివరించారు. కాగా, వివాదంలో ఉన్న భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించడంతో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడును నిందితుడిగా చేర్చినట్లు చెబుతున్నారు. గండిపేటకు చెందిన నిమ్మల దశరథ కుటుంబ సభ్యులు ఈ భూమి తమదంటూ కొన్నాళ్లుగా చెబుతున్నారని అంటున్నారు. దీనిపై వారు హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. హైకోర్టులో రిట్ పెండింగులో ఉండగా, నకిలీ జీవోలతో అమ్మేందుకు ప్రయత్నించారని పోలీసులు చెబుతున్నారు. నిమ్మల కుటుంబ సభ్యుల నుంచి భూమిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించడంతోనే మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తదితరులు కేసులో ఇరుక్కున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివాదాస్పద భూమిని కొనుగోలు చేసేందుకు రూ.4 కోట్లు అడ్వాన్స్ చెల్లించడంతో పోలీసులు ఆయనను నిందితుడిగా చేర్చారని అంటున్నారు. దీంతోనే బొల్లా అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ అంశం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

# బ్యాక్ టు బ్యాక్ ఐపీఎల్ ట్రోఫీలు గెలిచిన జట్లు ఇవే.. ధోని, రోహిత్ క్లబ్‌లో ఆర్సీబీ చేరేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 ఆఖరి అంకానికి వచ్చేసింది భయ్యా. రెండు నెలల సంబురానికి రేపటితో ఎండ్ కార్డు పడబోతుంది. మే 31 (ఆదివారం) నాడు అహ్మదాబాద్ నరేంద్ర మోడీ స్టేడియంలో రజత్ పాటిదార్ నాయకత్వంలోని ఆర్సీబీ, శుభ్‌మన్ గిల్ సారథ్యంలో గుజరాత్ టైటాన్స్ ట్రోఫీ కోసం గట్టిగ కుస్తీ పడబోతున్నాయి. క్వాలిఫయర్-1లో గుజరాత్‌ని ఘోరంగా ఓడించి ఫైనల్ కి బెంగళూరు చేరింది. ఒకవేళ రేపు గనుక మ్యాచ్ గెలిస్తే ఆర్సీబీ పోరగాళ్లు హిస్టరీ క్రియేట్ చేస్తారు. వరుసగా రెండో ఏడాది కప్పు కొట్టి, ఐపీఎల్ చరిత్రలోనే ఒక కిర్రాక్ రికార్డును పైసా వసూల్ రేంజ్ లో సొంతం చేసుకునే గోల్డెన్ ఛాన్స్ పాటిదార్ సేన ముందుంది.

**ధోని, రోహిత్ ఎలైట్ క్లబ్‌లో పాటిదార్ చేరేనా?:**

ఐపీఎల్ చరిత్రలో వరుసగా రెండు సార్లు కప్ కొట్టి టైటిల్‌ను డిఫెండ్ చేసుకున్న రికార్డు కేవలం రెండు జట్లకు మాత్రమే ఉంది. ఒకవేళ ఆర్సీబీ గనుక రేపు గెలిస్తే, రజత్ పాటిదార్ నేరుగా మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మల పక్కన కుర్చీ వేసుకుని కూర్చునే అవకాశం దక్కుతుంది.

**18 ఏండ్ల కల నెరవేరింది:**

2025లో 18 ఏండ్ల శాపాన్ని బద్దలు కొట్టి ఫస్ట్ టైటిల్ ముద్దాడిన ఆర్సీబీ.. ఈసారి కూడా అదే ఊపులో ఉంది. మరి ధోని, రోహిత్ ల తర్వాత వరుసగా రెండోసారి ఐపీఎల్ సామ్రాజ్యాన్ని ఏలబోయే ఆ మూడో కెప్టెన్‌గా పాటిదార్ నిలుస్తాడా లేదా అనేది రేపు రాత్రికి తేలిపోతది.

**లాస్ట్ బాల్ థ్రిల్లర్ రివెంజ్?:**

మరోవైపు శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఊరికే వదిలేలా లేదు.. వాళ్ళ హోమ్ గ్రౌండ్‌లో మ్యాచ్ కాబట్టి మస్తు కాన్ఫిడెన్స్‌తో ఉంటారు. 2022లో ఐపీఎల్‌లోకొచ్చిన డెబ్యూ సీజన్ లోనే కప్పు కొట్టి రచ్చ లేపిన గుజరాత్, 2023లో కూడా వరుసగా రెండోసారి కప్ కొట్టేలా కనిపించింది. కానీ ఆ ఫైనల్లో సీఎస్‌కే చేతిలో లాస్ట్ బాల్ థ్రిల్లర్‌లో ఓడిపోయింది.

**కసితో రగిలిపోతున్న గిల్ సేన:**

మళ్లీ మూడేండ్ల తర్వాత గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్ లో అడుగు పెట్టింది. ఐదు సీజన్లలో వీరికి ఇది మూడో ఫైనల్ మ్యాచ్ కావడం విశేషం. క్వాలిఫయర్-1 లో ఆర్సీబీ చేతిలో ఓడిపోయినప్పటికీ, క్వాలిఫయర్-2లో రాజస్థాన్‌ను ఓడించి, మళ్లీ గిల్ సేన ఫైనల్ లోకి ఎంట్రీ ఇచ్చింది. కాబట్టి తమ సొంత స్టేడియంలో ఆర్సీబీని బోల్తా కొట్టించాలని గుజరాత్ టైటాన్స్ జట్టు కసితో ఉంది.

# ఐపీఎల్ ఫైనల్స్‌లో కింగ్ కోహ్లీ రికార్డు ఇదే.. గుజరాత్‌తో ఫైట్‌కు ముందు విరాట్ హిస్టరీ డీకోడ్!

**హైదరాబాద్ పెన్ పవర్:** అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఐపీఎల్ 2026 ఫైనల్ కి కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది. రజత్ పాటిదార్ కెప్టెన్సీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి ఫైనల్‌లోకి దూసుకెళ్లి హిస్టరీ క్రియేట్ చేయడానికి సిద్ధమైంది. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగుతున్న ఆర్సీబీ ఆశలన్నీ ఎప్పటిలాగే కింగ్ విరాట్ కోహ్లీపైనే ఉన్నాయి. మరి ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు ఐపీఎల్ ఫైనల్స్ ప్రెజర్‌లో కోహ్లీ ట్రాక్ రికార్డ్ ఎలా ఉందో ఇప్పుడు తెలుసుకుందాం..



**కోహ్లీ ఐపీఎల్ ఫైనల్స్ జర్నీ:**

కోహ్లీ ఇప్పటి వరకు ఆడిన 4 ఐపీఎల్ ఫైనల్స్ మ్యాచ్‌లలో 34.75 సగటుతో మొత్తం 139 రన్స్ మాత్రమే చేశాడు. కెరీర్ మొదటి పదేళ్లలో ఫైనల్స్ అంటే కోహ్లీకి కేవలం గుండెకోత మాత్రమే మిగిలింది. కానీ గత ఏడాది (2025) జరిగిన ఫైనల్ మ్యాచ్ అతని తలరాతను పూర్తిగా మార్చేసింది.

**ఫైనల్స్‌లో కోహ్లీ రికార్డు:**

2009 (ఆర్సీబీ జం డెక్కన్ చార్జర్స్): అప్పట్లో కోహ్లీ కేవలం ఒక టీనేజ్ బ్యాటింగ్ సెన్సేషన్ మాత్రమే.. ఆ ఫైనల్‌లో ఆర్సీబీ చేతుల్లో ఉన్న మ్యాచ్‌ను చేజార్చుకుని రన్నరప్‌గా నిలిచింది.

2011 (ఆర్సీబీ జం చెన్నై సూపర్ కింగ్స్): సీఎస్‌కే విధించిన భారీ టార్గెట్ ఛేజింగ్‌లో కోహ్లీ 35 పరుగులతో పోరాట పటిమ చూపించినా.. లాభం లేకుండా పోయింది. చెన్నై ఘన విజయం సాధించింది.

2012--2016 ( ఆర్సీబీ జం సన్‌రైజర్స్ హైదరాబాద్): 2016 ఫైనల్‌లో కోహ్లీ చెలరేగి ఆడి 35 బంతుల్లో 54 పరుగులు సాధించాడు. కానీ, డేవిడ్ వార్నర్ ఆర్మీ ఆర్సీబీ కప్ చెదరగొట్టింది.

2025 (ఆర్సీబీ జం పంజాబ్ కింగ్స్): గత ఏడాది ఫైనల్‌లో కోహ్లీ పరుగులు చేయడానికి కాస్త ఇబ్బంది పడ్డాడు. 35 బంతుల్లో 43 రన్స్ నెమ్మదైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు, అలాగే బౌలింగ్‌లో భువనేశ్వర్ కుమార్, యష్ దయాల్, కృనాల్ పాండ్యా మ్యాజిక్ చేయడంతో ఆర్సీబీ ఎట్టకేలకు తమ ఫస్ట్ ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకుంది.

**ఫైనల్ లో ప్రెజర్లో కోహ్లీ నిజమేనా?:**

ఐపీఎల్ హిస్టరీలోనే కోహ్లీ పరుగుల రారాజు అనడంలో ఎలాంటి సందేహం లేదు.. కానీ, నార్మల్ మ్యాచ్‌లతో పోలిస్తే ఫైనల్స్‌లో అతని అగ్రెసివ్ నెస్, కన్సిస్టెన్సీ కొంచెం తగ్గినట్లు పలు గణాంకాలు చెప్తున్నాయి.

ఓవరాల్ కెరీర్‌లో 134o స్ట్రైక్ రేట్ ఉన్న కోహ్లీ.. ఫైనల్స్ మ్యాచ్‌లకు వచ్చేసరికి 126.36 స్ట్రైక్ రేట్‌తో కాస్త నెమ్మదించాడు. ఖగత ఏడాది ఫైనల్స్ (2025) లో కూడా ఫ్లాట్ పిచ్‌పై విరాట్ కోహ్లీ 35 బంతుల్లో 43 రన్స్ చేయడమే దీనికి ఉదాహరణ.

**ఫైనల్ గేమ్ చేంజర్:**

ఫైనల్స్ రికార్డ్స్ ఎలా ఉన్నా.. ఈసారి గుజరాత్ టైటాన్స్‌తో జరిగే మ్యాచ్‌లో కోహ్లీనే ఆర్సీబీకి లార్జర్- దన్ -లైఫ్ వెపన్. ఎందుకంటే గుజరాత్ టీమ్‌లో కగిసో రబాడ, మహమ్మద్ సిరాజ్ వంటి స్పీడ్‌తో భయపెట్టే 'రా పేస్' బౌలర్లు ఉన్నారు. కానీ కోహ్లీకి ఇలాంటి ఎక్స్‌ప్రెస్ పేస్‌ను ఎదుర్కోవడం వెన్నతో పెట్టిన విద్య.. ఈ ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్‌పై కోహ్లీ ట్రాక్ రికార్డ్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ఈ సీజన్‌లో గుజరాత్‌తో జరిగిన 3 మ్యాచ్‌ల్లో కోహ్లీ ఏకంగా 82 బంతుల్లో 152 రన్స్ కొట్టాడు. రబడా, సిరాజ్ వేసే పవర్‌ప్లే ఓవర్లలోని స్పీడ్‌ను కోహ్లీ గనుక ఈజీగా న్యూట్రలైజ్ చేస్తే.. అహ్మదాబాద్ గ్రౌండ్‌లో పరుగుల వరద పారడం ఖాయం.

# టీమిండియా నుంచి గిల్, సూర్య ఔట్.. వైభవ్ కి రెడ్ కార్పెట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్-2026 సీజన్ తుది దశకు చేరుకోవడంతో ఇప్పుడు అందరి దృష్టి భారత జట్టు పర్యటనలపై పడింది. ఈ ఏడాది ఐపీఎల్ ముగిసిన తర్వాత టీమిండియా వరుస సిరీస్ లతో బిజీబిజీగా గడపనుంది. మొదట స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్ తో ఒక టెస్ట్, 3 వన్డేల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత ఐర్లాండ్, ఇంగ్లాండ్, జింబాబ్వేలలో ఇండియన్ టీమ్ పర్యటించ నుంది. ఈ ఏడాది భారత జట్టుకి అత్యంత



కీలకమైన టోర్నమెంట్లలో ఏషియన్ గేమ్స్ (Asian Games) ఒకటి.. ఈ ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ వేదికగా కొనసాగనున్నాయి. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ కోసం 30 మంది ప్లేయర్స్ తో కూడిన ప్రాబబుల్స్ జాబితాను బీసీసీఐ సెలక్షన్ కమిటీ రెడీ చేసినట్లు టాక్. లిస్టులో టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, టెస్టు, వన్డే సారథి శుభ్ మన్ గిల్ కి స్థానం దక్కకపోవచ్చనే టాక్ వినిపిస్తుంది. ఐపీఎల్ 2026లో దుమ్ములేపిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని బీసీసీఐ షార్ట్ లిస్ట్ చేసినట్లు తెలుస్తుంది. వైభవ్ తో పాటు జైస్వాల్, శాంసన్, ఇషాన్, అభిషేక్, బుమ్రా, హార్దిక్, శ్రేయస్, నితీశ్, అక్షర్ వంటి స్టార్ క్రికెటర్లు కూడా ఈ ఏడాది ఆసియా గేమ్స్ ఆడనున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ 30 మంది లిస్టు నుంచే 15 మంది సభ్యుల జట్టును సెలక్ట్ చేయబోతున్నట్లు సమాచారం. ఈ ఆసియా క్రీడల కోసం జట్టుని ప్రకటించేందుకు జూన్ 10 చివరి తేదీగా ఫిక్స్ చేసినట్లు టాక్. ఈ టోర్నీ సమయంలోనే టీమిండియా సీనియర్ టీమ్ వెస్టిండీస్ పర్యటనకి వెళ్లనుంది. ఈ టూర్ లో భాగంగా ఆతిథ్య విండీస్ తో 5 టీ20లు, 3 వన్డేలని భారత్ ఆడనుంది. సెప్టెంబర్ 27న ఇండియా-- విండీస్ పర్యటన స్టార్ట్ అవుతుంది. తొలుత వన్డే సిరీస్ జరిగిన తర్వాత అక్టోబర్ 6 నుంచి టీ20 మ్యాచులు జరుగుతాయి. ఈ సిరీస్ సమయానికి అభిషేక్ శర్మ, సంజు శాంసన్ లాంటి స్టార్ ఆటగాళు ఏషియన్ గేమ్స్ ముగించుకుని జట్టుతో చేరే ఛాన్స్ ఉంది.



మీనాక్షి చౌదరి క్లాసిక్ చీర లుక్‌లో టైమ్‌లెస్ గాంభీర్యాన్ని ప్రసరిస్తుంది

# చేపల మార్కెట్‌కి వెళ్లి మాకు నచ్చే చేపలు కొని తెచ్చేది!- జాన్వీ

భారతీయ సినీపరిశ్రమలో తనదైన అద్భుత నటన, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ కిడ్ జాన్వీ కపూర్ తాజాగా తన తల్లి, దివంగత నటి శ్రీదేవి గురించి సంచలన విషయాలను షేర్ చేసారు. ప్రస్తుతం టాలీవుడ్ - బాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న జాన్వీ ఒక ఇంటర్వ్యూలో తన తల్లి వారసత్వాన్ని మోయడంపై మనసు విప్పారు. సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టినప్పటి నుండి తన తల్లి ఇమేజ్‌తో ఎదురవుతున్న పోలికలు, తన వ్యక్తిగత ఎదుగుదల.. మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ సరసన -పెద్ది- వంటి భారీ చిత్రాలలో నటిస్తున్న తరుణంలో తన ఆలోచనా విధానం ఎలా ఉందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వెల్లడించారు. చిన్నతనంలో తన తల్లి శ్రీదేవి ఎంతటి పెద్ద సూపర్‌స్టారో.. దేశవ్యాప్తంగా మామ్‌కు ఎంతటి క్రేజ్ ఉందో తనకు అస్సలు తెలిసేది కాదని జాన్వీ కపూర్ చెప్పారు. తాము ఎంత పెద్ద స్టార్ ఫ్యామిలీకి చెందినవారమైనా ఇంట్లో మాత్రం సినిమా వాతావరణాన్ని తల్లి ఎప్పుడూ దూరంగానే ఉంచేదని.. ఒక సాధారణ తల్లిలాగే తమను చూసుకునేదని వెల్లడించారు. మాకు అమ్మ సూపర్‌వుమన్ ఎందుకు అంటే.. ప్రతి శుక్రవారం ఫిష్ మార్కెట్‌కు వెళ్లి వంటకు ఏ రకం ఫిష్ బాగుంటుందో స్వయంగా ఎంపిక చేసి తీసుకురావడం. ఆ పనులన్నీ చేయడంలో అమ్మ ఎంతో గర్వంగా, సంతోషంగా ఫీల్ అయ్యేది! అని జాన్వీ తన చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తాను స్వయంగా నటనా రంగంలో అడుగుపెట్టి నటిగా పని చేయడం ప్రారంభించాకనే.. అసలు తన తల్లి ప్రేక్షకులకు ఎంతటి ఆరాధ్య దైవమో.. వారి జీవితాల్లో ఎంతటి ప్రాధాన్యత కలిగి ఉందో పూర్తిగా అర్థం కావడం ప్రారంభమైందని జాన్వీ అన్నారు. వెండితెరపైనే కాకుండా.. సాధారణ ప్రజల మనసుల్లో శ్రీదేవి పై ఉన్న అపారమైన ప్రేమాభిమానాల గురించి తెలుసుకోవడం ఒక గొప్ప బ్లెస్సింగ్‌గా భావిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి అపారమైన ప్రజాదరణ తరాలకోసారి.. ఎప్పుడో ఒకసారి మాత్రమే సాధ్యమవుతుందని.. తన తల్లి సృష్టించిన ఆ మ్యాజిక్‌ను మళ్లీ రీ-క్రియేట్ చేయడం ఎవరికైనా దాదాపు అసాధ్యమని జాన్వీ స్పష్టం చేశారు. సినిమా రంగంలో తనను నిరంతరం తల్లి శ్రీదేవితో పోల్చడంపై జాన్వీ కపూర్ ఎంతో మెచ్యూర్డ్‌గా సానుకూల దృక్పథంతో స్పందించారు. చిత్ర పరిశ్రమలో ఎవరినో ఒకరితో పోల్చడం చాలా సహజమైన విషయమేనని జాన్వీ



పేర్కొన్నారు. నన్ను భారతీయ చలనచిత్ర చరిత్రలోనే ఆల్ టైమ్ గ్రేటెస్ట్ యాక్ట్రెస్‌తో పోలుస్తున్నప్పుడు.. నేను దానిని ఒక అదృష్టంగా భావిస్తాను. ఆ పోలికలు నన్ను మరింత కష్టపడటానికి నా నటనను ప్రతి సినిమాకు మెరుగుపరుచుకోవడానికి ఒక గొప్ప ఎనర్జీని, మోటివేషన్‌ను ఇస్తాయి తప్ప అందులో ఎలాంటి నెగిటివిటీ లేదు! అని జాన్వీ చాలా స్పష్టంగా వివరించారు. ప్రస్తుతం తాను ఏ సినిమా చేసినా పూర్తి స్థాయి నిజాయితీతో చేస్తున్నానని.. నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టార్ కిడ్ అనే ట్యాగ్ ..శ్రీదేవి ఇమేజ్ తెచ్చే ఒత్తిడిని నెగిటివ్‌గా తీసుకోకుండా తన కెరీర్‌కు అదొక ఇంధనంగా మార్చుకున్నానని జాన్వీ కపూర్ చెప్పిన విధానం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ, మునుముందు నటిగా మరిన్ని శిఖరాలను అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. చరణ్- జాన్వీ జంటగా నటించిన పెద్ద జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



గోల్డెన్ గౌన్ బీచ్ ఫోటోషూట్‌లో జాక్వెలిన్ ఫెర్నాండెజ్ స్టన్స్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com